# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 11-4-2025 15/-




# నోట నవ్వు... నొసట వెక్కిరింపు



## రమజాన్ తదనంతరం కూడా దేహాన్ని ఆత్మ శాసించాలి



## ఇస్లాం దృక్పథంలో స్త్రీ

సహజీవన భావనల పొదరిల్లు

గీటురాయి వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 15 హైదరాబాద్
శుక్రవారం 11 ఏప్రిల్ 2025 రూ.15-00
12 షవ్వాల్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

జనులారా! అల్లాహ్‌ను మీ తప్పులకు క్షమాపణకై వేడుకోండి! ఆయన వైపునకే మరలండి. నేనైతే రోజుకు వందేసి సార్లు క్షమాపణకై అర్థిస్తూ ఉంటాను.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at “Geeturai Graphics”, Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


ఏప్రిల్ 11 జయంతి సందర్భంగా

Abid Hasan Safrani



# జైహింద్ నినాద సృష్టికర్త ఆబిద్ హసన్ సఫ్రానీ

8

## లోపల...


| | |
|---|---|
| ఇఫ్తార్ ...... | 04 |
| నోట నవ్వు ... నొసట వెక్కిరింపు ...... | 05 |
| రమజాన్ చలాగయా ...... | 10 |
| రమజాన్ తదనంతరం కూడా దేహాన్ని ఆత్మ శాసించాలి ...... | 12 |
| స్నేహ ధర్మం ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| ఈజిప్టు పరిస్థితులు, టర్కీ అనుభవాలు – గుణపాఠాలు – 2 ...... | 20 |
| చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమద్‌కు “ కళారత్న” పురస్కారం ...... | 23 |
| కుటుంబ వ్యవస్థను కాపాడుకుందాం! – 3 ...... | 24 |
| సమాజ సంస్కరణ మనందరి బాధ్యత ...... | 27 |
| ఇస్లాం దృక్పథంలో స్త్రీ ...... | 28 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |
| చాడీలు ...... | 34 |


**ఈ స్టేటుకు నేనే మేస్త్రినీ...**



(బీజేపీ స్టేట్ చీఫ్ పదవిపై వీడని ఉత్కంఠ)

కమల పువ్వు పార్టీకి
కావాలట ప్రెసిడెంటు
లోలోపలి రొచ్చు దాచి
పూస్తున్రు పైన సెంటు!
కావాలట సమర్థుడు
పనికిరాడటలే శుంఠ
అధినేతల ఆజ్ఞతోనె
వీడునంట ఉత్కంఠ!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## ఇఫ్తార్

**కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ** ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ ఇచ్చిన ఇఫ్తార్ విందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. ఏడేళ్ల తర్వాత మళ్ళీ జరిగిన ఇఫ్తార్ పార్టీ ఇది. ప్రతిపక్ష పార్టీల నాయకులందరూ హాజరైన ఈ ఇఫ్తార్‌లో రాహుల్ గాంధీ పాల్గొనడం రాజకీయంగా ముఖ్యమైన పరిణామం. ఒకప్పుడు ఇఫ్తార్ పార్టీలు ప్రతి ఏటా జరిగేవి. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చి, మోడీ ప్రధాని అయిన తర్వాత ఇఫ్తార్ పార్టీలు కూడా ఆగిపోయాయి. ఇఫ్తార్ పార్టీలు ముస్లింలను బుజ్జగించే రాజకీయ నాటకాలుగా బీజేపీ ప్రచారం చేయడం మొదలయ్యింది. కాంగ్రెస్ కొంతకాలం ఈ సంప్రదాయాన్ని కొనసాగించడానికి ప్రయత్నించింది. సోనియా గాంధీ 2014, 2015లో, రాహుల్ 2018లో రెండు ఇఫ్తార్ పార్టీలు ఇచ్చారు. కాని రాజకీయంగా ప్రతికూలత ఎదురయ్యింది. అందువల్ల ఆ తర్వాత మానేశారు.

నిజానికి, 2018లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ ఇఫ్తార్ పార్టీ ఇచ్చిన తర్వాత గత ఏడేళ్లలో ఆయన ఇతరుల ఇఫ్తార్ పార్టీలోను ఎప్పుడు పాల్గొనలేదు. ఈ మధ్య కాలంలో లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ రెండు సార్లు ఓడిపోయింది.

ఇన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో కలిసి ఇఫ్తార్ పార్టీలో పాల్గొనడం విశేషం. మరో విషయమేమిటంటే, ఖర్గే, రాహుల్ ఇద్దరు కూడా కుంభమేళకు వెళ్ళలేదు. ఈ విషయమై బీజేపీ విమర్శలు కూడా సంధించింది. పైగా ఖర్గే చేసిన వ్యాఖ్య – కుంభమేళలో మునక వేస్తే పేదరిక సమస్య పరిష్కారమవుతుందా అనే వ్యాఖ్యతో కూడా వివాదం రాజుకుంది. కాని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ కూడా కుంభమేళకు వెళ్ళలేదని ఇమ్రాన్ ప్రతాప్ గఢీ చెప్పడమే కాదు, రాహుల్ గాంధీ బద్రీనాథ్, వైష్ణోదేవీ వెళ్ళారు కదా మరి ఆయన్ని హిందూ హృదయ సామ్రాట్ అని ఎందుకు అనడం లేదని ఎదురు ప్రశ్న వేశారు.

ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఇఫ్తార్ పార్టీలు ప్రాచుర్యం పొందాయి. ఆ మాటకొస్తే కేంద్రమంత్రుల్లో ఇఫ్తార్ విందుకు అసలు శ్రీకారం చుట్టినవారు విద్యాశాఖామాత్యులు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్. ఇఫ్తార్ పార్టీలు రాజకీయాల్లో భాగమయ్యాయి. అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న రామ్ విలాస్ పాశ్వాన్, శరద్ యాదవ్‌లు కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం లాన్‌లో 2001లో ఇఫ్తార్ పార్టీ ఇవ్వడం అప్పట్లో చర్చనీయాంశం అయ్యింది. వాజ్‌పేయి, ఆ తర్వాత మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రులుగా ఏటా ఇఫ్తార్ పార్టీలు నిర్వహించారు. మోడీ వచ్చిన తర్వాత ఈ సంప్రదాయం ఆగిపోయింది. మోడీ 2017 వరకు రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీ నిర్వహించిన ఇఫ్తార్ పార్టీలకు కూడా దూరంగా ఉన్నారు.

ఈ సంప్రదాయం ఇప్పుడు అవసరం లేదనే బీజేపీ అగ్రనేతల వైఖరి స్పష్టంగా ఉన్నప్పటికీ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా శివరాజ్ సింగ్ చౌహాన్ ఇఫ్తార్ పార్టీలు కొనసాగించారు. కాని 2014 తర్వాత ఇఫ్తార్ పార్టీలు బీజేపీలోనే కాదు, రాజకీయంగా నష్టం కలుగుతుందనే భయంతో ఇతర పార్టీలు, కాంగ్రెస్ పార్టీ కూడా ఇవ్వటం మానేశాయి.

ఆ తర్వాత ఇఫ్తార్ పార్టీలు రాజకీయాల్లో కనుమరుగవ్వడం ప్రారంభం అయ్యింది. 2016, 2017లో కాంగ్రెస్ ఇఫ్తార్ పార్టీలు ఇవ్వలేదు. 2018లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాహుల్ ఢిల్లీలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మాజీ రాష్ట్రపతులు ప్రణబ్ ముఖర్జీ, ప్రతిభా పాటిల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నప్పటికీ చాలా మంది దూరంగానే ఉన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ ఇఫ్తార్ పార్టీలను పూర్తిగా ఆపేసింది.

ఇప్పుడు ఇమ్రాన్ ప్రతాప్ గఢీ ఇచ్చిన ఇఫ్తార్ పార్టీకి రాహుల్ హాజరయ్యారు. మార్చి 21న ఢిల్లీలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నిర్వహించిన ఇఫ్తార్‌లో సోనియాగాంధీ కూడా పాల్గొన్నారు. ఇది ముస్లింల విషయంలో పార్టీ వైఖరిలో మార్పును సూచిస్తోంది. అదే విధంగా, వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ మార్చి 29న కేరళలోని మలప్పురంలో ఐయుఎంఎల్ నేత సయ్యద్ సాదిక్ అలీ నిర్వహించిన ఇఫ్తార్ పార్టీలో పాల్గొన్నారు.

కాంగ్రెసు ముస్లిం బుజ్జగింపు రాజకీయాలు నడుపుతుందన్న ప్రచారంతో బీజేపీ లాభపడుతుందన్న భయసందేహాలతోనే కాంగ్రెస్ ఇఫ్తార్ పార్టీలకు దూరంగా ఉండడం మొదలయ్యింది. ముస్లిముల సమస్యలపై కూడా కాంగ్రెసు గొంతు విప్పడానికి సంకోచించేది. సాఫ్ట్ హిందూత్వ ద్వారా హిందూ ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నాలు కూడా చేసింది. పౌరసత్వ సవరణ చట్టంపై జరిగిన నిరసనలకు ముందు వరకు కాంగ్రెసు పరిస్థితి ఇదే. కాని ఆ తర్వాత పార్టీ వైఖరిలో మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారత్ జోడో యాత్ర తర్వాత ఈ మార్పు కాస్త స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు ముస్లిముల సమస్యలపై మాట్లాడడానికి కాంగ్రెస్ సంకోచించడం లేదనే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని మతపరమైన హింసతో ప్రభావితమైన సంభాల్‌ను రాహుల్, ప్రియాంక సందర్శించ డానికి ప్రయత్నించడం, పాలస్తీనా సమస్య విషయంలో ప్రియాంక వ్యాఖ్యలు, ఇస్రాయీల్ పై విమర్శలు, ముస్లింలకు రిజర్వేషన్లు కేటాయించ డానికి సిద్ధరామయ్య నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పార్టీ గట్టిగా సమర్థించడం – ఇవన్నీ మారిన వైఖరికి నిదర్శ నాలు.

బీజేపీ మరింత బాహాటంగా మతతత్వ రాజకీయాలు ఒకవైపు ప్రదర్శిస్తూ మరోవైపు మోడీ సౌగాత్ పేరుతో ముస్లిములకు కానుకలివ్వడాన్ని కూడా ప్రజలు గమనిస్తున్నారు. ఇదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పండుగ సందర్భంగా ముస్లిములకు కానుకలిస్తే బీజేపీ ఎలాంటి రాద్ధాంతం చేసేదో కూడా అంచనాలు వేస్తున్నారు. బీజేపీ నేతలు ఎంత బాహాటంగా మత తత్వ రాజకీయాలకు పాల్పడుతున్నారో అంతగా కాంగ్రెస్‌తో పాటు ప్రతి పక్షాలు సెక్యులర్ విలువలకు కట్టుబడి ముస్లిముల సమస్యలపై మాట్లాడే వాతావరణం క్రమంగా రూపుదిద్దుకుంటోందని కొందరి అంచనా.

**కవరు కథనం** | **అబ్దుల్ వాహెద్**



# నోట నవ్వు... నొసట వెక్కిరింపు

**మోదీగారు** రమజాను మాసంలో ముస్లిములకు, పేద ముస్లిములకు రమజాన్ కానుకలు అందిస్తున్నారన్న వార్త విన్న తర్వాత ఈ సామెతే గుర్తుకువచ్చింది. ఎందుకంటే, పండుగ నమాజు ఇంటిపైకప్పుపై చదివినా నేరమే కేసులు పెడతామని ఆయన పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రంలోనే హంగామా జరిగింది. హోలీ రంగు ఇష్టం లేకపోతే, రంగు పడిన అవయవాన్ని కోసిపారేయండనే సలహాలు కూడా ఆయన పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్ర పోలీసులే ఇచ్చారు.

ఈ రమజాన్ మాసంలో వచ్చిన వార్తలు ఒకసారి గమనించడం ఎంతైనా అవసరం. ఎందుకంటే, ఈ వార్తలు ఒక దేశంగా మనం ఎటు వెళుతున్నామన్న దిశను సూచించే వార్తలు.

ఈసారి రమజాన్ పండుగ సందర్భంగా మైనార్టీలను ఆకట్టుకోడానికి మోదీగారు ముస్లిములకు కానుకలు అందించారు. ముస్లిములకు రమజాన్ సందర్భంగా సౌగాతె మోడీ కిట్ పంచిపెట్టారు. ఇందులో సేమియా, ఖర్జూరం, డ్రై ఫ్రూట్స్, పంచదార వంటి ఆహార పదార్థాలే కాదు, పురుషులు, స్త్రీల కోసం 600 రూపాయల విలువైన పైజామా, సల్వార్ కమీజ్ దుస్తులు కూడా ఉన్నాయి దేశం మొత్తం మీద 32 లక్షల మంది పేద ముస్లిములకు ఈ కిట్లను అందిస్తామని రమజానుకు ముందు బీజేపీ నేతలు గర్వంగా ప్రకటించారు.

రాజకీయాల్లో మార్కెటింగ్ టెక్నిక్కులు కొత్తేమీ కాదు. కాని ఈద్ సందర్భంగా 32 లక్షల మందికి మోదీజీ సౌగాత్ పేరుతో కిట్లను పంపిణీ చేయడం మార్కెటింగు టెక్నిక్కులకు పరాకాష్ఠ వంటిదే. ఇది ముస్లిము సముదాయానికి దగ్గరయ్యే కార్యక్రమంగా బీజేపీ నేతలు చెప్పుకున్నారు. కాని ఆలోచించ వలసిన విషయమేమిటంటే, బీజేపీ కేవలం మార్కెటింగ్ కార్యక్రమాల్లో భాగంగా ఈ పని చేస్తుందా? లేక నిజంగానే బీజేపీ ఆలోచనా తీరు మారిపోయి సబ్‌కా సాత్ మాటపై నిలబడాలనుకుంటుందా?

ఎందుకంటే, ఇదే పని ఒకవేళ ఏదన్నా కాంగ్రెసు ప్రభుత్వం ఏ రాష్ట్రంలో అయినా చేసి ఉంటే ఎలా ఉండేది? జాతీయ మీడియా, ఇప్పుడు యూట్యూబ్‌లో చాలా మంది గోదీ మీడియాగా పిలుస్తున్న మీడియాలో డిబేట్లు, చర్చలు హోరెత్తిపోయేవి. ప్రధాని మోదీ కాంగ్రెసును దుమ్మెత్తిపోసి ఉండేవారు. ముస్లిములకు కాంగ్రెసు సేమియాల విందు చేస్తుందని ఆరోపించేవారు. ముస్లిములకు దోచి పెడుతుందని బురదజల్లేవారు. కాంగ్రెసుకు హిందువులు గుర్తుకు రారా, వారి పండుగల్లో ఎప్పుడైనా ఇలా ఇచ్చారా అంటూ నిలదీసి ఉండేవారు. నిజాయితీగా ఆలోచిస్తే ఈ వాస్తవాలు బోధపడతాయి.

ఒకప్పుడు నిరసనకారులను దుస్తులను చూసి గుర్తుపట్టవచ్చని చెప్పిన మోడీ ఇప్పుడు వారికి దుస్తులు పంచిపెడుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో మోదీగారు చెప్పిన మాటలను కూడా ఒకసారి గుర్తు చేసుకుందాం. కాంగ్రెసు హిందువుల నుంచి లాక్కుని వాళ్ళకు (ముస్లిములకు) పంచి పెడుతుందని చెప్ప

లేదా? మంగళసూత్రాలు, బర్రెలు అన్ని పంచిపెట్టేస్తారని చెప్ప లేదా? దేశ సంపదను చొరబాటుదారులకు పంచిపెట్టే స్తుందని చెప్ప లేదా? ఈ మాటలు ఆయన ముస్లిములను ఉద్దేశించి చెప్పారన్నది కూడా స్పష్టం.

ఇప్పుడు ఆ ముస్లిముల ఇండ్లకే మోడీ పండుగ కిట్ కానుకలు పంపిస్తున్నారు. కాని మౌలానా ఆజాద్ యూనివర్శిటీ స్కాలర్ షిప్పులు ఎందుకు ఆగిపోయాయని ఆయన్ను ఎవరైనా ప్రశ్నిస్తే బాగుండును. ఇలాంటి ప్రశ్నలు అడిగేవారు లేరు. అడిగినా జవాబులు రావు. నిజానికి ఇప్పుడు రమజానులో ముస్లిములకు కానుకలు పంపిస్తున్న మోడీగారు, కుంభమేళ సందర్భంగా ప్రయాణీకులకు ఉచిత రైలు సౌకర్యం ఎందుకు కల్పించలేదు? ఈ ప్రశ్న అడిగేవారెవ్వరు?

హఠాత్తుగా మోడీగారికి ముస్లిములపై ఇంత ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చింది? బీహారు ఎన్నికల ప్రయోజనాల కోసమా? లేక అరబ్బు దేశాధినేతలను ప్రభావితం చేయడానికా? వంటి అనేక ప్రశ్నలు విశ్లేషకులు సంధిస్తున్నారు.

ముస్లిముల విషయంలో బీజేపీ నేతల వైఖరి ఎలా ఉందన్న ప్రశ్నకు జవాబు తడుముకోనవసరం లేదు. పార్లమెంటులో బీజేపీ నేత బిధూరి తన తోటి పార్లమెంటేరియన్ డానిష్ అలీని తిట్టిన తిట్లు సభాపతి మహోదయులు కూడా విన్నారు. కాని బిధూరిపై బీజేపీ ఎలాంటి చర్య తీసుకోలేదు. ఇప్పుడు కూడా బిధూరియా వివాదాస్పద వ్యాఖ్యలు వస్తూనే ఉన్నాయి. ఇఫ్తార్ పార్టీలకు ఎవరైనా ప్రతిపక్ష నేతలు వెళితే వారిని నానా విధాలుగా విమర్శించే బీజేపీ ఇప్పుడు ఈ రమజాన్ కానుకలు ఎందుకు పంపిస్తున్నట్లు?

బీహారులో ఎన్నికలు రాబోతున్నాయి. ప్రతిపక్షాలు ఒక్కటవు తున్నాయి. బీజేపీకే కాదు, బీజేపీ కూటమిలో ఉన్న నితీష్ కుమార్‌కు కూడా సవాళ్ళు తప్పవని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. చిరాగ్ పాశ్వాన్, జితన్ రామ్ మాంఝీ వంటి నేతలకు కూడా ఇబ్బందికరమైన పరిస్థితి ఉంది. కాబట్టి ఇదంతా రాజకీయ జిమ్మిక్కు అని కొందరి అభిప్రాయం. ఇందులో కొంత నిజం ఉండవచ్చు. బీజేపీ గతంలో కూడా పస్మాందా ముస్లిము లకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేసి విఫలమైంది. ముస్లిములకు టిక్కెట్లు ఇవ్వని బీజేపీ 2023లో ఉత్తరప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లిములకు టిక్కెట్లు ఇచ్చింది. ఇటీవల ప్రధాని మోదీ జహానె ఖుస్రో కార్యక్రమానికి హాజరయ్యారన్నది కూడా గమనించాలి.

రమజాన్ కానుకలు మోడీ ఇస్తుంటే, మరోవైపు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లిములకు హెచ్చరికలు బెదిరింపులతో ఈ రమజాన్ గడిచింది. మీరట్ పోలీసు అధికారి రోడ్లపై ఎవ్వరు నమాజు చేయరాదని హుకుం జారీ చేశాడు. అలా చేస్తే కేసులు పెట్టి పాస్ పోర్టులు రద్దు చేస్తామని బెదిరించాడు. పాస్ పోర్టులు రద్దు చేసే అధికారం పోలీసులకు ఎప్పటి నుంచి లభించింది? ఈ బెదిరింపు ఉత్తర్వులు పోలీసు అధికారి జారీ చేయడం వెనుక ఉన్నవారెవ్వరు? ఏదన్నా చట్టవ్యతిరేక కార్యక్రమం జరిగితే కోర్టులు విచారించి శిక్ష విధిస్తాయి కాని పోలీసులే శిక్షలు విధిం చేయడం ఎప్పటి నుంచి ప్రారంభమయ్యింది?

సంభాల్‌లో పోలీసులు మరో రెండాకులు ఎక్కువ చదివారు. రోడ్లపైనే కాదు, ఇంటి పైకప్పులపై కూడా ఎవ్వరూ నమాజు చేయరాదని, అలా చేస్తే కేసులు పెడతామన్నారు. సంభాల్‌లో భారీగా పోలీసు బందోబస్తు వీడియోలు చూస్తే, సంభాల్‌లో ఏదో జరగబోతుందనిపించింది. ఇదంతా ఒక విధమైన సైకలాజికల్ ఒత్తిడి. ముస్లిములను భయాందోళనలకు గురి చేసే ఎత్తుగడ. హిందువుల్లోను విద్వేషాన్ని నూరిపోసే కార్య క్రమం. ముస్లిములు రోడ్లపై నమాజు చేసి హిందువు లకు ఏదో ప్రమాదం తెచ్చిపెడుతున్నారని, తాము హిందువులను కాపాడేస్తున్నామనే భావన కలిగించే ప్రయత్నమిది. ఉత్తర ప్రదేశ్, బీహారు రాష్ట్రాల్లో రోడ్లపై నమాజు చేయడాన్ని బీజేపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ మాట్లాడుతున్నారు. నిజమే ట్రాఫిక్‌కు ఆటంకం కలిగేలా రోడ్లపై నమాజు చేయ రాదు. కాని, ట్రాఫిక్‌కు ఆటంకమనే కారణంతోనే రోడ్లపై నమాజును వ్యతిరేకిస్తున్నారా? కాస్త ఆలోచిస్తే ఇది పెద్ద అబద్ధమని అర్థం చేసుకోవడం కష్టం కాదు. కాని చాలా మంది ఈ వాదనను నమ్మేస్తున్నారా అనిపి స్తోంది. నమాజు వల్లే కాదు ఇతర కార్యక్రమాలు, ధార్మిక కార్య క్రమాల వల్ల కూడా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. కాని, దుర్గాపూజ, రామనవమి, గణేష్ చతుర్ధి, రథయాత్రలు, హోలీ, కన్వర్ యాత్ర ఇలాంటి అనేక సందర్భాల్లో పోలీ సులు ఇలా హెచ్చరికలు ఎప్పుడైనా జారీ చేశారా? హిందూ పండుగ లకు సంబంధించిన ఊరేగింపులు, యాత్రల సందర్భంలో ఇలాంటి మాటలు ఎందుకు వినిపించడం లేదు. వాస్తవమేమి టంటే, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు రోడ్లపై, బహిరంగ స్థలాల్లో ముస్లిములకు ఎలాంటి హక్కు లేదని, హిందువులకు సర్వహక్కులు ఉన్నాయని పరోక్షంగా చెబుతున్నాయి. కొంత కాలం క్రితం గుర్గాంవ్‌లో బహిరంగ ప్రదేశంలో నమాజు చదువు తున్న వారిపై గుండాగుంపులు దాడులు చేశాయి. పోలీసులు కూడా వారికి తందానా పాడారు. ముఖ్యమంత్రి యోగీ ఆదిత్య నాథ్ బహిరంగ ప్రదేశాల్లో నమాజులు చేయరాదన్నాడు. కొందరు మంత్రులు ఇలా నమాజులు చేసి భూదురాక్రమణలకు పాల్పడుతారని కూడా మాట్లాడారు. నిజంగా ఇదంతా కేవలం రోడ్డు భద్రత, ట్రాఫిక్ కారణాల వల్లనే చేస్తున్నారా. అలా అయితే ఇంటి పైకప్పులపై నమాజు చేసుకుంటే వచ్చిన ఇబ్బందేమిటి? పైకప్పులపై ట్రాఫిక్ ఉండదు కదా. మరో ఉదాహరణ రాంపూర్‌లో ఒక మస్జిదు ఇమామ్ ఇఫ్తార్ సమయాన్ని లౌడ్ స్పీకరులో ప్రకటించినందుకు అరెస్టు చేశారు. ఎందుకంటే ఇతర

మతసముదాయం ప్రజలు అభ్యంతర పెట్టారట. పొరుగు వాడు పొరుగువాడికి శత్రువయ్యే పరిస్థితి ఇది. ఈ పరిస్థితి గురించే స్వయంగా బీజేపీ మిత్రపక్షానికి చెందిన జయంత్ చౌదరీ హెచ్చరించాడు. అంటే ఇప్పుడు మస్జిదులో అజాన్ లేదా ఇఫ్తార్ సమయం గురించి ప్రకటన వినబడి నంతనే హిందువుల చెవులు అపవిత్రం అయిపోతున్నాయా? ఆ విధంగా అలా చేయడం నేరమైపోయిందా? ముస్లిములకు సంబంధించిన సాముదాయిక కార్యక్రమం ఏదైనాసరే అభ్యంతర పెట్టడం, దాన్ని ఒక కుట్రగా చూసే వాతావరణం ఏర్పడింది.

బ్రిటీషు కాలంలో ఒక చట్టం ఉండేది. క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ 1871. ఈ చట్టం ఒక సముదాయాన్నే నేరసముదాయంగా గుర్తించేది. అందువల్ల పోలీసుల దాష్టీకానికి ఆ సముదాయం గురయ్యేది. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకపోయినా ఆ సముదాయానికి చెందిన ప్రజలు శిక్ష అనుభవించవలసి వచ్చేది. స్వాతంత్ర్యం తర్వాత ఈ చట్టాన్ని రద్దు చేశారు. కాని ఇప్పుడు జరుగుతున్నదేమిటి? ముస్లిములకు సంబంధించిన ప్రతి విషయాన్ని నేరంగా ముద్రవేయడమే కదా. ముస్లిములు ఇల్లు కొంటే, ఆ ప్రాంతంలో శాంతి భద్రతలు దెబ్బతింటా యనే ఆరోపణ, ఎక్కడైనా దుకాణం తెరిచినా, వీధుల్లో గాజులు అమ్ముకున్నా అనుమానాస్పదులే. పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైతే అది యుపియస్సీ జిహాద్. భూమి కొంటే ల్యాండ్ జిహాద్. హర్యానాలో ఈద్ పండుగకు సెలవు లేదు. రెస్ట్రిక్టెడ్ హాలిడే జాబితాలో ఉంది. ఆ రోజు కార్యాలయాలన్నీ పని చేస్తాయి. ఎవరైనా రాకూడదని అనుకుంటే సెలవు పెట్టుకో వాలి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇదంతా వివక్ష కాదా?

మరోవైపు హిందూ పండుగల సందర్భంగా జరుగుతున్నదేమిటి? ముస్లిములను అనుమానాస్పదులుగా ముద్రవేసి వారిని అవమానించడం. గతంలో ఈ పని బీజేపీ నేతలు చేసేవారు, ఇప్పుడు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పోలీసు అధికారులు అత్యుత్సాహంగా చేస్తున్నారు. భారతదేశంలో ఇలాంటి పరిస్థితి, ఈ వాతావరణం గతంలో ఎన్నడైనా ఉందా? కొన్ని రోజుల క్రితమే హోలీ పండుగ జరిగింది. ఏడాదికి శుక్రవారాలు 52 వస్తాయి కాని హోలీ పండుగ ఒక్కటే వస్తుంది కాబట్టి హోలీ రంగుల వల్ల సమస్య అనుకునే వాళ్ళు (అంటే ముస్లిములు) ఇండ్లలోనే ఉండాలని బయటకు రాకూడదని ఒక పోలీసు అధికారి చెబితే, యోగీ ఆదిత్యనాథ్ ఆ మాటలకు మద్దతిచ్చాడు. ఈ సంవత్సరం హోలీ, శుక్రవారం రెండు కలిసి వచ్చాయి. అందులోను రమజాన్ నెలలోని శుక్రవారం. ముస్లిములు సాముదాయిక నమాజు కోసం తప్పక మస్జిదులకు వెళతారు. అలా వెళ్ళ కుండా అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయి. హోలీ ఆడుతున్న హిందువులకు కనబడకుండా 200 మస్జిదులపై ప్లాస్టిక్ పరదాలు కట్టారు. హిందూ పండుగల సందర్భంగా ఉద్రిక్త తలు రెచ్చగొట్టే వాతావరణం ఎందుకు కల్పిస్తున్నారు? దీన్ని గురించి అందరూ ఆలోచించవలసిన అవసరం ఉంది.

హోలీ పండుగ సందర్భంగా మత ఉద్రిక్తతలు రెచ్చగొట్ట డానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. హోలీ రంగులు చల్లుకోవడమూ, శుక్రవారం నమాజులు ప్రశాంతంగా జరిగాయి. ఈద్ సందర్భంగా కూడా మతసామరస్యం ప్రజల్లో ప్రముఖంగా కనిపించింది. రాజస్థాన్ జైపూరులో ఈద్ ప్రార్థనలకు వచ్చిన ముస్లిములపై హిందువులు పూలవాన కురిపించారు.

స్వాతంత్ర్యానంతరం 1947 ఆగష్టు 18వ తేదీన రమజాన్ పండుగ జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన మూడు రోజులకే ఈ పండుగ జరిగింది. దేశంలో అటు పంజాబ్, ఇటు బెంగాల్ మతోన్మాద మంటలకు ఆహుతవుతున్న కాలం అది. వేలాది మంది హిందువులు, ముస్లిములు, సిక్కులు ఈ మతోన్మాదానికి గురయ్యారు. దేశవిభజన జరిగిన సమయమది. ఆ వాతావరణంలో స్వతంత్ర భారతదేశంలో ముస్లిములకు రమజాన్ పండుగ జరుపుకునే అవకాశాలే ఉండవేమో అనిపించిన కాలంలో, ముస్లిములు ఇక రెండవ తరగతి పౌరులుగా బతకవలసి వస్తుందనిపించిన రోజుల్లో, ముహమ్మదన్ స్పోర్టింగ్ క్లబ్ ఆవరణలో పండుగరోజు ఒక ప్రార్థనాసమావేశం జరిగింది. లక్షలాది మంది హిందువులు, ముస్లిములు ఈ సభకు హాజరయ్యారు. స్వయంగా గాంధీజీ ఈ సభలో ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఈద్ శుభాకాంక్షలు చెప్పడం తన మొదటి బాధ్యత అన్నారు. ఒకప్పుడు హిందువులు, ముస్లిములు ఈ రోజున ఆలింగనం చేసుకుని సంబరాలు జరుపుకునేవారని, చాలా సంవత్సరాల తర్వాత అలాంటి వాతావరణం ఈ సభలో తనకు కనిపించిం దని సంతోషం ప్రకటించారు. ఈ మత సామరస్యం కొనసాగుతుందని ఆయన ఆశించారు.

రాజకీయశక్తులు, వారి ఆదేశాలను పాటించడానికి అత్యుత్సాహం చూపించే పోలీసు పాలనాయంత్రాంగం కలిసి హిందూ ముస్లిముల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నా రన్నది సుస్పష్టం. హిందువుల్లో ముస్లిముల పట్ల భయాం దోళనలు నూరిపోసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముస్లిములను విలసీకరించడం కొనసాగుతోంది. కాని ఈ ప్రయత్నాలను సాధారణ ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. కొన్ని మతశక్తుల చేష్టల వల్ల వాతావరణం కలుషితమైనప్ప టికీ భారత సమాజంలోని బహుళ భావన, మతసామరస్యా లను ప్రకటించే అనేక సంఘటనలు ముందుకు వస్తూనే ఉన్నాయి. ఫైజ్ అహ్మద్ ఫైజ్ రాసినట్లు …

**లంబీ హై గమ్ కి షామ్ మగర్ షామ్ హీ తో హై...** ఈ విషాద రాత్రి పెద్దదే కాని, ఇది ఒక్క రాత్రి మాత్రమే. ఉదయం కాక తప్పదు. హిందూ ముస్లిం భాయి భాయి అనే వాతావరణం వర్ధిల్లుతూనే ఉంటుంది. ✤

ఏప్రిల్ 11 జయంతి సందర్భంగా

Abid Hasan Safrani



# జైహింద్ నినాద సృష్టికర్త ఆబిద్ హసన్ సఫ్రానీ

**యండి. ఉస్మాన్ ఖాన్ , సీనియర్ జర్నలిస్ట్**

**భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో** అనేక మంది మహనీయులు తమ ధన ప్రాణాలను త్యాగం చేశారు. ఆంగ్లేయుల కబంధ హస్తాల నుండి దేశాన్ని రక్షించడానికి అలుపెరుగని పోరు సలిపారు. వారి దాష్టీకాలను ఎదిరించి గుండెల్లో రైళ్ళు పరుగెత్తించారు. వారి కుయుక్తులను పసిగట్టి ఎత్తుకు పైఎత్తులు వేస్తూ అసాధారణ ధైర్య సాహసాలతో ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించారు. ఈనాడు మనం ఇంత నిశ్చింతగా స్వేఛ్ఛా వాయువులు పీలుస్తున్నామంటే, దీని వెనుక అనేక మంది త్యాగధనుల కృషి, ప్రయత్నం, త్యాగం, అమరత్వం ఉన్నాయి. స్వాతంత్ర్య సముపార్జనకు ఎవరి పంథాలో వారు అవిరళ కృషి సలిపారు. గాంధీజీ లాంటివారు అహింసతోనే స్వాతంత్ర్యాన్ని సాధించాలని భావిస్తే, సుభాష్ చంద్రబోసు వంటివారు, అహింసా మార్గం అనే భాష ఆంగ్లేయులకు అర్థం కాదని, సాయుధ పోరాటమే శరణ్యమని నమ్మారు. లక్ష్యసాధన కోసం 'ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్' అనే రాజకీయ పార్టీని, 'ఆజాద్ హింద్ ఫౌజ్' అనే విప్లవ సైనిక సంస్థను స్థాపించి ఆంగ్లేయులపై యుద్ధం ప్రకటించారు. ఆంగ్ల పాలకులను దేశం నుండి తరిమి కొట్టడానికి సాగిన సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఆజాద్ హింద్ ఫౌజ్ (స్వతంత్ర భారత జాతీయ సైన్యం) సాగించిన సాయుధ పోరాటం అజరామరం. ఇందులో బోసు సహచరులైన ముస్లిం సమర యోధులు ప్రధాన పాత్ర పోషించారు. అందులో ఆబిద్ హసన్ సఫ్రానీ ముఖ్యులు. ఈయన మన తెలంగాణ ముద్దుబిడ్డడు. హైదరాబాదు వాసి. ఐఎఫ్ ఎస్ అధికారి. డెన్మార్క్,

> ఆసేతు హిమాచలం ఆబాలగోపా లాన్ని ఉర్రూతలూరించిన జైహింద్ నినాద స్రష్ట ఆబిద్ హసన్ సఫ్రానీయే కావడం తెలంగాణ వాసులకు గర్వకారణం. చాలా కొద్ది సమయంలోనే ఈ జైహింద్ నినాదం స్వాతంత్ర్య సమర యోధుల అధికారిక నినాదంగా మారిపోయింది. ఇప్పటికీ రాజకీయ నాయకులు, దేశ భక్తులు ప్రతి చోటా తరచుగా ఈ నినాదాన్ని ఉపయోగిస్తూ ఉంటారు. అనుపమానమైన దేశభక్తికి తార్కాణంగా చేసే నినాదంగా నేటికీ ప్రజల హృదయాల్లో బలంగా ముద్రించుకుపోయిందీ

ఈజిప్ట్ సహా పలుదేశాల్లో భారత రాయబారిగా పనిచేశారు. బహుభాషా కోవిదుడు. ఉర్దూ, పర్షియన్ భాషల్లో అద్భుతమైన కవిత్వం రాసిన పండితాగ్రేసరుడు. సుబ్ సుఖ్ చైన్ సృష్టికర్త. సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్లో చదువుకున్నారు. ఆయన తల్లి ఫఖ్రుల్ హాజియా బేగం. హైదరాబాదులో ఆంక్షలు ఉన్నప్పటికీ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ధీరవనిత. గొప్ప దేశభక్తురాలు. సరోజినీనాయుడు స్నేహితురాలు. ఆబిద్ హసన్ ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకున్నాడు. కాని తల్లి ఫఖ్రుల్ హాజియా బ్రిటిషు వ్యతిరేకత ఆయనపై గట్టి ప్రభావం చూపింది. శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నాడు. చదువు ఆగిపోయింది. తరువాత ఇంజనీరింగ్ విద్య కోసం జర్మనీ వెళ్లాడు. అక్కడే సుభాస్ చంద్రబోస్‌ని కలుసుకున్నాడు. స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు కూడగట్టేందుకు బోసు చేస్తున్న ప్రసంగాలు ఆబిద్

హసన్ను మరింత ప్రభావితం చేశాయి. దీంతో ఇంజనీరింగ్ చదువును మధ్యలోనే విడిచిపెట్టి, బోస్‌కి వ్యక్తిగత కార్యదర్శిగా, జర్మన్ భాష అనువాదకుడిగా చేరిపోయ్యాడు. బోస్ పునర్వ్యవస్థీక రించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో ఆబిద్ మేజర్‌గా పని చేశారు. భారత జాతీయ సైన్యం ఏర్పడినప్పటి నుండి, సుభాష్ చంద్రబోస్ భారత జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, భారత జాతీయ సైన్యాన్ని పునర్ వ్యవస్థీకరించి, 'చలో ఢిల్లీ' నినాదంతో భారతీయ యోధులను నడిపించడం, ఆ తరువాత భారత జాతీయ సైన్యంపై ఆంగ్ల ప్రభుత్వం సైనిక విచారణ జరపడం లాంటి సంఘటనలలో, నిర్వహణా పరంగా ఏర్పడిన అన్ని విభాగాల్లో ముస్లిం పోరాట యోధులు అద్వితీయమైన పాత్రను పోషించారు. 1941లో గృహ నిర్బంధంలో ఉన్న బోసు బ్రిటిష్ ప్రభుత్వం కళ్ళలో మన్నుగొట్టి కలకత్తా నుంచి అదృశ్యమై, ఆఫ్ఘని స్థాన్, రష్యా మార్గాల ద్వారా జర్మనీ చేరుకునే వరకు అయనకు అన్ని విధాలుగా బాసటగా నిలచి, ప్రతి చారిత్రక సందర్భం లోనూ వారు బోసుకు వెన్నుదన్నుగా నిలిచారు. ఈ ఏర్పాట్లన్నీ మియా అక్బర్ షా పర్యవేక్షించగా, ఆ తరువాతి ప్రాణాంతక కాబూల్ ప్రయాణంలో అక్బర్‌షా ఏర్పాటు చేసిన సాయుధ పఠాన్ యువకులే నేతాజీకి అంగరక్షకులుగా నిలిచారు. ఆఫ్ఘాన్ మీదుగా పఠాన్ వేషంలో నేతాజీ ప్రయాణం సాగించాల్సి వచ్చి నప్పుడు, ఆంగ్ల గూఢచారులు, వారి తొత్తులు ఏమాత్రం గుర్తు పట్టకుండా ఆబాద్ ఖాన్ నేతాజీకి ఆఫ్ఘనీ పఠాన్ల వ్యవహారసరళి, ఆచార సంప్రదాయాలలో వారం రోజుల పాటు తన ఇంట్లో రహస్యంగా ప్రత్యేక శిక్షణ ఇచ్చి పంపారు. 1941 మార్చి 27న నేతాజీ బెర్లిన్ చేరేంతవరకు అంతటి ప్రమాదకర పరిస్థితులలో ఆయనను కంటికి రెప్పలా కాపాడి విజయవంతంగా గమ్యానికి చేర్చడంలో సహాయ పడ్డారు. ఆ తరువాత అత్యంత ప్రమాదకర మైన, చరిత్రాత్మక జలాంతర్గామి ప్రయాణంలో ఆబిద్ హసన్ సఫ్రానీ సుభాష్ చంద్రబోస్ వెన్నంటి ఉన్నారు. శత్రు పక్షాల నిఘానీడలో మూడు నెలలపాటు సముద్ర గర్భంలో 25,600 కిలోమీటర్లు సాగిన ఈ ప్రయాణంలో బోసుకు తోడుగా ఉండి, భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పనలో ఆయనకు తోడ్పాటు అందించారు ఆబిద్ హసన్. ఆసేతు హిమాచలం ఆబాలగోపా లాన్ని ఉర్రూతలూరించిన జైహింద్ నినాద స్రష్ట ఆబిద్ హసన్ సఫ్రానీయే కావడం తెలంగాణ వాసులకు గర్వకారణం. చాలా కొద్ది సమయంలోనే ఈ జైహింద్ నినాదం స్వాతంత్ర్య సమర యోధుల అధికారిక నినాదంగా మారిపోయింది. ఇప్పటికీ రాజకీయ నాయకులు, దేశ భక్తులు ప్రతి చోటా తరచుగా ఈ నినాదాన్ని ఉపయోగిస్తూ ఉంటారు. అనుపమానమైన దేశభక్తికి తార్కాణంగా చేసే నినాదంగా నేటికీ ప్రజల హృదయాల్లో బలంగా ముద్రించుకుపోయిందీ జైహింద్ నినాదం. జర్మనీ

**అక్కడే సుభాష్ చంద్రబోస్‌ని కలుసుకున్నాడు. స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు కూడగట్టేందుకు బోసు చేస్తున్న ప్రసంగాలు ఆబిద్ హసన్ను మరింత ప్రభావితం చేశాయి. దీంతో ఇంజనీరింగ్ చదువును మధ్యలోనే విడిచిపెట్టి, బోస్‌కి వ్యక్తిగత కార్యదర్శిగా, జర్మన్ భాష అనువాదకుడిగా చేరిపోయ్యాడు.**

బ్రిటన్‌తో యుద్ధం చేస్తున్న సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీలో భిన్న వర్గాలకు చెందిన ప్రజలు ఉండే వారు. అందులో కొంత మంది 'నమస్కార్' అని సంబోధిస్తే, మరికొంత మంది 'రామ్ రామ్' అంటూ పలకరించుకునేవారు. 'సత్ శ్రీ అకాల్', 'అస్సలాము అలైకుం' అంటూ అభివాదం చేసుకునేవారు కూడా ఉండేవారు.

సెక్యులర్ భావాలు కలిగిన బోస్‌కు ఇన్ని రకాల అభివాదాలు ఉండటం సబబుగా అనిపించలేదు. అందరికీ ఆమోద యోగ్య మైన ఓ అభివాద నినాదాన్ని రూపొందించాలని ఆయన తన సన్నిహితులకు చెప్పారు. ఆబిద్ హసన్ ముందుగా 'హలో' అని ప్రతిపాదించారు. కాని బోస్‌కు అది నచ్చలేదు. తరువాత 'జై హిందుస్తాన్', 'జై హింద్' అని ప్రతిపాదించారు ఆబిద్. జై హిందుస్తాన్ కాస్త పెద్దగా ఉండడం వల్ల 'జై హింద్' కే బోసు జై కొట్టారు. ఈ నినాదం బోస్‌కు ఎంతగానో నచ్చింది. వెంటనే ఆయన దాన్ని ఆమోదించి, ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి 'జై హింద్' అనే పదం దేశ భక్తిని చాటుకునే ఒక మహత్తర నినాదంగా మారిపోయింది. జైహింద్ అంటే భారత దేశానికి జయం కలుగుగాక అని అర్థం.

అధికారిక, అనధికారిక సభలు, సమావేశాలు, కార్యక్రమాలు, ప్రసంగాలు ఏవైనా సరే ముగింపులో మనకు వినిపించే ఏకైక చిట్టచివరి పదం ఇదే. కాని ఇది ఎలా ఉనికిలోకొచ్చింది? ఎలా వాడుకలోకొచ్చింది? ఎవరు సృష్టించారు? ఎవరు ప్రాచుర్యంలోకి తెచ్చారు? దీని పుట్టు పూర్వోత్తరాలు ఏమిటి? అలవోకగా పలికే స్తున్న ఈ పదం గొప్పతనం గురించి నేటి తరంలో ఎంతమందికి తెలుసు? అంతేకాదు, మనం ఈనాడు సుభాష్ చంద్రబోసును 'నేతాజీ' అని సంభోధిస్తున్న బిరుదు కూడా ఆబిద్ హసన్ సఫ్రానీ ప్రదానం చేసిందే. చివరికి అది అసలు పేరును డామినేట్ చేసి నేతాజీ లేకుండా బోసు పేరు పలికే పరిస్థితి లేకుండా చేసింది. ఇంతటి ప్రేమ పూర్వక స్నేహాన్ని నేతాజీతో పంచుకొని, మహత్తరమైన దేశభక్తి నినాదాన్ని జాతికి అందించిన మహ నీయుడు, అసమాన త్యాగధనుడు ఆబిద్ హసన్ సఫ్రానీ గారిని సదా గుర్తుంచుకోవడం మనందరి నైతిక కర్తవ్యం. ✤




**ఈద్ నెలవంక** కనిపించింది. కారుణ్య మాసం, వరాల వసంతం, రమజాన్ మాసం మనందరినీ వీడి వెళ్ళిపోయింది.

ఎటు చూసినా నమాజీలతో కళకళలాడుతూ కనిపించిన మస్జిదులు ఇప్పుడు బోసిపోయినట్లుగా కనిపిస్తున్నాయి.

సూర్యుడు ఉదయించక ముందు ప్రతి ఇంటిలో సహ్రీ సందడుల చప్పుడ్లు ఇప్పుడు మూగబోయాయి.

సూర్యాస్తమయ సమయంలో మసీదుల్లో కళకళలాడుతూ ఉన్న ఇఫ్తార్ విందుల హడావుడులు సద్దుమణిగాయి.

ఈ వాతావరణం చూసి షైతాన్ ఆనందంతో గంతులు వేస్తున్నాడు.

విశ్వాసులను వదలి వెళుతూ రమజాన్ దుఃఖంతో ఇలా బాధపడి ఉంటుంది-

ఓ దురదృష్టవంతులారా! కరుణామయుడు అయిన సృష్టికర్త అల్లాహ్ ఎలాగైనా తన దాసులను స్వర్గానికి అర్హులు చేయాలని రమజాన్ మాసం లాంటి పుణ్యాల సరోవరం ఇచ్చాడు.

ఒకటికి డెబ్బై రెట్లు అధికంగా పుణ్యాలను ఇచ్చే ఆఫర్ ఇచ్చాడు.

కల్మషం లేని హృదయంతో, సకల చెడులకు దూరంగా ఉంటా నన్న వాగ్దానంతో, స్వచ్ఛమైన మనసుతో "లైలతుల్ ఖద్ర్" రాత్రి ఆరాధన చేస్తే జీవిత కాలం (వెయ్యి నెలలు) ఆచరించిన దానికన్నా అధికంగా పుణ్యాలు ఇస్తాను అని ఆశ కల్పించినా, మనలో చాలా మంది షైతాన్ సోదరులు గానే మిగిలిపోవడం చూసి భరించలేక బాధతో తిరుగు ముఖం పట్టింది రమజాన్.

ఉపవాసాలు పాటించి ఆకలి అంటే ఏమిటో ఆచరణాత్మకంగా తెలుసుకోమంటే, మిగతా రోజుల్లో కన్నా ఎక్కువగా తినే రోజులుగా మార్చేసి రమజాన్ ఉపవాసాల ఉద్దేశాన్ని తారుమారు చేశారని దుఃఖిస్తూ పయనమైనపోయింది రమజాన్.

తరావీహ్‌లో మానవ జీవిత మర్మాన్ని తెలిపే ఖుర్ఆన్ గ్రంథం పారాయణం చేయాలి. దాని ఉద్దేశం సృష్టికర్త ఆదేశాలు తెలుసుకుని తదనుగుణంగా ఆచరణాత్మకంగా తమ జీవితాలను తీర్చిదిద్దుకోవడం.

కానీ, ఇక్కడ కూడా మనిషి ఏమరుపాటుకు గురి అయ్యి తరావీహ్ అంటే నమాజ్ చేయడం, ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ముగించడం, కొందరైతే మూడు రోజుల్లో, మరి కొందరు ఆరు రోజుల్లో, పదిరోజుల్లో, ఒక్క రోజులో కూడా ఖుర్ఆన్ విని మేము "తరావీహ్" పూర్తి చేసుకున్నాం అనే భ్రమలో ఉన్నారు.

ఇలా చేయడం అల్లాహ్‌తో పరిహాసమాడటం అవుతుంది. అల్లాహ్

ఆదేశాలను ప్రవక్త ముహమ్మద్(స) చూపిన మార్గంలో ఆచరించకుండా మనోవాంఛలకు దాస్యం చేస్తున్నాం.

బనీఇస్రాయిల్ జాతి ఇలాగే సబ్బత్ ఆజ్ఞను ఉల్లంఘించి పరిహాసం ఆడి అల్లాహ్ ఆగ్రహానికి గురి కావడం జరిగింది.

శనివారం చేపలు పట్టరాదని ఆదేశం ఇవ్వడం జరిగింది. కానీ ఆ రోజే చేపలు ఎగిరెగిరి వచ్చేవి. అందులో కొందరు తెలివైన వారు కాలువలు తవ్వి చేపలను గుంటల్లోకి మళ్ళించి ఆదివారం వాటిని పట్టుకుని అమ్ముకునే వాళ్ళు.

వారి ఈ అతి తెలివి పనికి అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడింది. వారిని కోతులుగా మార్చివేయబడినట్లు స్వయంగా ఖుర్ఆన్‌లో తెలియ జేయడం జరిగింది.

దయచేసి ఇలాంటి తెలివితేటల ప్రదర్శన మానుకోవాలి.

సాదా సీదా జీవితం జీవించాలి అన్నది ఇస్లాం ఆదేశం.

అల్లాహ్ మెప్పు కోసం కాకుండా ఇతరులకు చూపించడం కోసం చేసే పనులన్నీ రేపు పరలోకంలో వృథా అయిపోతాయి. ప్రదర్శనా బుద్ధి షిర్క్‌తో సమానం. షిర్క్ అంటే దైవానికి సాటి కల్పించడం. ఇది మహా ఘోరమైన పాపం.

కానీ ఈ రమజాన్‌లో చాలా వరకు షైతాన్ ఈ ప్రదర్శనా బుద్ధి అనే చెడుతోనే మన పుణ్యాలన్ని ఎందుకు పనికి రాకుండా చేస్తాడు.

మిత్రులారా! మళ్ళీ రమజాన్ వరకు మనలో ఎవరు ఉంటారో, ఎవరు ఉండరో మనలో ఎవరికీ తెలియదు.

ఇది ప్రళయ కాల సమయం. నిజమైన విశ్వాసుల మీద ఆపదలు వెల్లువలా ఒకదాని తర్వాత ఒకటి విరుచుకుపడుతాయి.

మంచికి చెడుకు మధ్య పోరాటం జరుగుతుంది.

ఇలాంటి ఈ క్లిష్ట పరిస్థితుల్లో, దైవంపై అచంచల విశ్వాసంతో ముందుకు సాగాలి. చెడుకు మంచి, మానవత్వం, ప్రేమ ఆప్యాయతలతో సమాధానం చెప్పాలి. బురదను బురదతో కడుగం కదా. బురదను నీటితో కడగాలి. ఇదే విషయాన్ని రమజాన్‌లో అవతరించిన ఖుర్ఆన్‌లో సృష్టికర్త ఇలా సెలవిచ్చాడు.

**"ప్రవక్తా! మంచీ, చెడూ ఒకటి కావు. నీవు చెడును అతి శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రుభావం కలవాడు నీకు ప్రాణ స్నేహితుడై పోవటాన్ని నీవు గమనిస్తావు. ఈ సుగుణయోగం సహనశీలురకు తప్ప మరెవరికీ లభ్యం కాదు. ఈ స్థానం మహా అదృష్టవంతులకు తప్ప మరెవరికీ దక్కదు. ఒకవేళ నీకు షైతాను నుండి ఏదైనా దుష్ ప్రేరణ కలిగితే అప్పుడు అల్లాహ్ శరణు కోరుకో, ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ ఎరిగినవాడూను." (41: 34-36)**

మళ్ళీ రమజాన్ లభిస్తే ఈ రమజాన్‌లో చేసిన పొరపాట్లు మళ్ళీ జరగకుండా చూసుకుంటాము అల్లాహ్, మా తప్పులను మన్నించి బుజుమార్గంలో ఖుర్ఆన్ చూపిన మార్గంలో నడిచే సద్బుద్ధి ప్రసాదించమని వేడుకుందాం.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com



# రమజాన్ తదనంతరం కూడా దేహాన్ని ఆత్మ శాసించాలి

- డాక్టర్ సాజిద్ అబ్బాసీ

అల్లాహ్ మనిషికి శరీరం, ఆత్మ రెండింటిని ప్రసాదించాడు. మానవ ఆత్మలో నైతిక స్పృహ, బుద్ధి, చైతన్యాలు నిక్షిప్తమై ఉన్నాయి. అత్యున్నత స్థాయి పనులు సాధించడానికి యోగ్యమైన శరీరాన్ని మనిషి పొందాడు. జంతువులకు శరీరం, ప్రాణం ఉన్నాయి, వాటితో పాటు సహజసిద్ధమైన జంతు ప్రవృత్తి ఉంటుంది. అందువల్ల అవి నిర్దిష్ట ఆహారానికి, జీవనానికి కట్టుబడి ఉంటాయి. ఆత్మరక్షణ చేసుకుంటూ, పునరుత్పత్తి ద్వారా జాతిని కొనసాగిస్తూ ఉంటాయి. అయితే, ఇతర జీవులపై మనిషికి ఉత్కృష్టతను ప్రసాదించిన అల్లాహ్ మనిషికి ఆలోచించే, ఆచరించే స్వేచ్ఛను ఇచ్చాడు. మనిషి కోసం భూమిపై అల్లాహ్ అనేక అనుగ్రహాలను ప్రసాదించాడు. వాటన్నింటినీ వాడుకునే స్వేచ్ఛను ఇచ్చాడు.

తొలి మానవుడు ఆదం (అలైహిస్సలాం) సృష్టి తర్వాత దైవదూతలు అల్లాహ్ సమక్షంలో ఒక సందేహాన్ని వ్యక్తం చేశారు. మనిషికి భూమిపై లెక్కలేనన్ని అనుగ్రహాలు ప్రసాదించి, స్వేచ్ఛను, అధికారాలను కూడా ఇస్తే, మనిషి వాటిని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని, భూమిపై కల్లోలం చెలరేగుతుందని, మనిషి రక్తపాతాలకు కారణమవుతాడని అన్నారు. అల్లాహ్ నాకు తెలిసినది మీకు తెలియదని వారికి చెప్పాడు. అల్లాహ్ ఒక ఉన్నతమైన లక్ష్యంతోనే భూమిపై కల్లోలానికి కారణమయ్యే స్థితిని కూడా అనుమతించాడు. ఆ ఉన్నతమైన ఉద్దేశ్యం ఏమిటనేది ప్రశ్న. ఆ ఉన్నతమైన ఉద్దేశ్యం ఏమిటంటే, మనిషిని పరీక్షించడం. అంటే సృష్టికర్తను కళ్ళారా చూడకపోయినా ఆయన చిహ్నాలను చూసి, ఆయన అనుగ్రహాలను గుర్తించి, సృష్టికర్త గురించి తెలుసుకుని, తమ మాటలతో, చేతలతో సృష్టికర్తకు కృతజ్ఞతలు తెలిపిన పుణ్యాత్ములను, తమ సృష్టికర్త, విశ్వప్రభువు సమక్షంలో జవాబిచ్చుకోవాలని నమ్మినవారిని, మనోవాంఛలను నిగ్రహించుకున్నవారిని, ఎంచుకోవడం. ఇలాంటి వారే నిజానికి సాఫల్యం పొందేవారు. అలాంటి వారిని ఎంచుకోడానికే అల్లాహ్ ఈ విశ్వాన్ని సృష్టించాడు. ఇందులో మనిషిని పుట్టించాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**“తన ప్రభువు ముందు నిలబడవలసి ఉంటుందని భయపడి, తన మనస్సును దుష్టవాంఛలకు దూరంగా ఉంచిన వ్యక్తి యొక్క నివాసం స్వర్గమవుతుంది.” (నాజిఆత్: 40, 41)**

భూమిపై మనిషి తాత్కాలిక జీవితం కష్టాలతో నిండి ఉన్నప్పటికీ పరలోకంలో స్వర్గ ప్రవేశమే మనిషికి అంతిమ సాఫల్యమని దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వాక్యం చెబుతోంది. ఈ అంతిమ సాఫల్యాన్ని సాధించడానికి మనిషి దైవాభీష్టానికి అనుగుణంగా బతకాలి, తన కోరికలను అదుపులో ఉంచుకోవాలి. అంటే మనిషికి ఉన్న ఆధ్యాత్మిక, నైతిక ఉనికికి లోబడి మనిషి భౌతిక ఉనికి ఉండాలి. ఇదే- తక్వా. అంటే దేవుని పట్ల భయభక్తులు. మనిషిలో ఈ లక్షణాన్ని పెంపొందించడానికే దేవుడు ఉపవాసాలను తప్పనిసరి చేశాడు. రమజాను మాసంలో గడిచిన నెలరోజులు ముస్లిములు ఈ ఉపవాసాలనే పాటించారు.

**ఉపవాసాల ద్వారా దేవుడు పెంపొందించాలనుకునే భయభక్తులు నిజానికి నిగ్రహశక్తిని ప్రసాదించే బ్రేకుల వంటివి. బ్రేకులు లేకుండా వాహనం నడపడానికి ఎవరూ సాహసించలేరు. అదేవిధంగా ఆత్మనిగ్రహం లేకుండా సామాజిక జీవనాన్ని గడపడం కూడా అసాధ్యం.**

పగ్గాలు తన చేతిలో లేని గుర్రంపై స్వారీ చేయాలని బుద్ధి ఉన్న వాడెవ్వడూ అనుకోడు. మనుషులు జంతువులపై స్వారీ చేసినంత కాలం పగ్గాలు వారి చేతుల్లోనే ఉండేవి. మనిషి సైకిళ్లు, మోటార్ సైకిళ్లు, మోటారు కార్లు, బస్సులు, రైళ్లు, విమానాలు వంటి వాహనాలను కనుగొన్నప్పటికీ వీటన్నింటిలో సాధారణమైన విషయం ఏమిటంటే వాటిని ఆపడానికి బ్రేకులు ఉండడం. బ్రేకులు లేని వాహనాన్ని ఊహించలేము. అపరిమితమైన కోరికలు, అసంఖ్యాక వనరులపై నియంత్రణ ఉన్న మనిషి ప్రమాదాలకు గురికాకుండా తన బతుకుబండి నడపాలంటే బ్రేకులు అనివార్యం. నేడు చాలా మంది తమ జీవనవాహనాన్ని బ్రేకులు లేకుండానే నడుపుతున్నారు. అందువల్లనే కోర్టులు, పోలీసు విభాగాలు ఉన్నప్పటికీ సమాజంలో అన్యాయం, దౌర్జన్యాలు జరుగుతున్నాయి.

ఉపవాసాల ద్వారా దేవుడు పెంపొందించాలనుకునే భయభక్తులు నిజానికి నిగ్రహశక్తిని ప్రసాదించే బ్రేకుల వంటివి. బ్రేకులు లేకుండా వాహనం నడపడానికి ఎవరూ సాహసించలేరు. అదేవిధంగా ఆత్మనిగ్రహం లేకుండా సామాజిక జీవనాన్ని గడపడం కూడా అసాధ్యం. నిజ దైవాన్ని తిరస్కరించే వారు తమ కోరికలను గుడ్డిగా అనుసరిస్తారు, ఫలితంగా, నైతిక, సామాజిక జీవితాల్లో ప్రమాదాలకు గురవుతారు. ఈ ప్రమాదాల కొన్ని ఫలితాలు ఈ ప్రపంచంలోనే కనిపిస్తాయి. అసలు ఫలితాలు పరలోకంలో కనిపిస్తాయి. ఒక వాహనం మరొక వాహనాన్ని ఢీకొన్నప్పుడు రెండూ వాహనాలకు నష్టం ఎలా వాటిల్లుతుందో అదేవిధంగా నైతిక, సామాజిక జీవితంలో ప్రమాదాలకు గురైనవారు స్వయంగా నష్టపోవడమే కాకుండా ఇతరులను కూడా నష్టపోయేలా చేస్తారు. నేడు నైతిక జీవితం ప్రమాదాలతో నిండి ఉంది. హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. అత్యాచారాలు, హత్యలు, యుద్ధాలు జరుగుతున్నాయి. ఈ నైతిక ప్రమాదాలు మనిషి నైతిక జీవితంలో బ్రేక్ లేకపోవడం వల్లనే ఇవి వాటిల్లుతున్నాయి.

మనోవాంఛలపై నియంత్రణ ఎలా సాధ్యం? అల్లాహ్ అనుక్షణం చూస్తున్నాడన్న సచేతన స్పృహ, బలమైన నమ్మకాల వల్ల ఇది సాధ్యమవుతుంది. ఇది అందరికీ కనబడకుండా ఉండవచ్చు కానీ అల్లాహ్‌కు కనబడకుండా ఉండడం సాధ్యం కాదని, మనిషి మనస్సులో మాటలు కూడా అల్లాహ్‌కు తెలుసని బలంగా నమ్మడం. అలాగే అల్లాహ్ సమక్షంలో తన కర్మలకు జవాబు చెప్పుకోవాలని గట్టిగా విశ్వసించడం. ఈ భావనే అసలైన బ్రేక్. మనిషి బతుకుబండిని నైతిక ప్రమాదాల నుండి రక్షించే బలమైన బ్రేక్ ఇదే. అయితే, ఏ చెడుల నుంచి ఎలా, ఎప్పుడు రక్షణ పొందాలి? ఈ వివరాలు చెప్పేది ఎవరు? అన్నది ప్రశ్న. మనిషి బలహీనతలు, మనిషి స్వభావం అని ప్రతి విషయాన్ని తెలిసిన సృష్టికర్తను మించి నైతిక కట్టుబాట్ల గురించి ఎవరు బాగా చెప్పగలరు?

ఉపవాసాల్లో అల్లాహ్ రెండు విషయాలను ప్రధానంగా ఎంచుకున్నాడు. ఒకటి అన్నపానీయాల కోరిక, రెండవది లైంగికేచ్ఛ. మొదటిది దేహపోషణకు అవసరం, రెండవది పునరుత్పత్తి అవసరం. అల్లాహ్ ఈ కోరికలను అవసరమైన మేరకు ఉంచాడు. ఆకలి తీవ్రత ఆహారం కోసం అన్వేషించేలా చేస్తుంది. మనిషి కష్టపడి పనిచేయడానికి సిద్ధంగా ఉంటాడు. అదేవిధంగా, లైంగిక కోరిక వల్లనే మనిషి వివాహం చేసుకుని జీవితాంతం కుటుంబం కోసం కష్టపడతాడు. మనిషికి ఆకలి తెలియకపోతే, ఆహారం తీసుకోనందువల్ల చనిపోతాడు. ఆ విషయం కూడా అతని గ్రహింపులోకి రాదు. అదేవిధంగా, మనిషిలో లైంగిక కోరిక లేకపోతే, వివాహం చేసుకుని కుటుంబభారం మోసే బాధ్యతను తీసుకోడు. అల్లాహ్ ఈ రెండు కోరికలను మనిషి ప్రాథమిక అవసరాలుగా చేశాడు, దాంతోపాటు, ఈ కోరికలను నైతిక నియమాలకు కట్టుబడేలా ఆదేశించాడు. మనిషి ఆకలి తీర్చుకోవడానికి కడుపు నింపుకోవాలి, కానీ అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించి కాదు. దొంగతనం, లంచం, దోపిడీ, మోసం, అన్యాయాల ద్వారా డబ్బు సంపాదించకూడదు. కష్టపడి, ధర్మబద్ధమైన పద్ధతుల్లో డబ్బు సంపాదించాలి. అదేవిధంగా, మనిషి తన లైంగిక కోరికను తీర్చుకోవచ్చు, కానీ వివాహ నిబంధనలకు లోబడి మాత్రమే. ప్రశ్న ఏమిటంటే, ఈ బలమైన కోరికలను ఎలా నియంత్రించాలి? కారు ఎంత వేగంగా వెళు తుందో, అంతే బలమైన బ్రేకులు అవసరం. స్త్రీపురుషులు తమ చూపులను కాపాడుకోవాలని ఇస్లాం బోధిస్తుంది. స్త్రీపురుషులు ఏకాంతంలో కలుసుకోరాదు. ఇది వివాహేతర సంబంధాలకు దారితీస్తుంది. ఫలితంగా భార్యాభర్తల మధ్య నమ్మకం సన్నగిల్లు తుంది. మానసిక ప్రశాంతత అంతమవుతుంది. కుటుంబాలు కుప్పకూలుతాయి. అదేవిధంగా, కుటుంబ పోషణ అవసరానికి మించి సంపాదించాలనే దురాశ మనిషిని అక్రమ సంపాదన కోసం గుడ్డిగా పరుగులు పెట్టేలా చేస్తుంది. అందువల్ల ఆర్థిక నేరాలు జరుగుతాయి. దీనివల్ల ధనవంతులు మరింత

ధనవంతులు అవుతారు. పేదలు మరింత పేదలు అవుతారు. దైవభీతి మాత్రమే మనిషిని నైతిక పరిధుల్లో ఉంచుతుంది. దీని ద్వారా మాత్రమే మనిషి దేహం, ఆత్మకు లోబడి ఉంటుంది. దేశాభివృద్ధిలో కూడా దైవభీతి చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. దైవభీతి బాధ్యతాయుతులైన పౌరులను సృష్టిస్తుంది. వారు ధర్మాధర్మాల, మంచీచెడుల మధ్య తేడాను గుర్తిస్తారు. వారు అప్పుడు స్వార్థపరులుగా కాదు, శ్రేయోభిలాషులుగా ఉంటారు. ఇస్లాం ఏర్పాటు చేసిన ఆరాధనల వ్యవస్థ ద్వారా అలాంటి నైతిక శిక్షణ ఇవ్వబడుతుంది. ఆ విధంగా ఉత్తమపౌరులు రూపొందుతారు. నమాజ్ మనిషిని దేవునితో కలుపుతుంది. చెడుల నుంచి, అశ్లీలమైన పనుల నుంచి నిరోధిస్తుంది. ఉపవాసం మనిషిలో ఆత్మనిగ్రహం, నైతిక క్రమశిక్షణను సృష్టిస్తుంది. దీనివల్ల మనిషి తన మనోవాంఛలను అదుపులో ఉంచుకుని, పాపాలకు అపరాధాలకు దూరంగా ఉంటాడు. జకాత్ వ్యవస్థ సమాజంలోని బలహీనులకు ఆసరా ఇచ్చి, స్వంత కాళ్లపై నిలబడేలా చేస్తుంది. అందువల్లనే నెల రోజుల పాటు ఉపవాసాల ద్వారా, ప్రతి రోజూ పన్నెండు నుండి పద్నాలుగు గంటల సమయంలో అనుక్షణం మనిషి దేవుడు తనను చూస్తున్నాడనే స్పృహతో నైతిక శిక్షణ పొందుతాడు. దేహంపై ఆత్మ ఆధిపత్యానికి సంబంధించిన ఈ శిక్షణ మనిషిలో ఆత్మనిగ్రహాన్ని సృష్టిస్తుంది. ఇది ఉపవాసిని సమాజానికి ప్రయోజనకరమైనవాడిగా, శ్రేయోభిలాషిగా మారుస్తుంది. ఉపవాసం దేశానికి ఉత్తమ పౌరులను అంది స్తుంది. వారి మాటలు చేతల వల్ల ఎవరికీ ఎలాంటి హాని కలుగదు.

రమజాను మాసంలో దేవుని పట్ల భయభక్తుల గుణాలు పెంపొందుతాయి. ఈ గుణాలను మిగిలిన పదకొండు నెలల పాటు ఎలా కొనసాగించాలి? దేహంపై ఆత్మ ఆధిపత్యం కొనసాగే ఈ సాధన ప్రభావం రమజాన్ తర్వాత కూడా ఎలా కొనసాగేలా చేయాలి? ఉదయం నుండి సాయంత్రం వరకు ఒక రోజు ఉపవాసం ఉండి, సాయంత్రం ఇఫ్తార్ (ఉపవాస విరమణ)తో ఉపవాసాన్ని పూర్తి చేసినట్లే, యావత్తు జీవితాన్ని ఒక ఉపవాసంలా గడపాలని ఇస్లాం కోరుతుంది. ఈ సుదీర్ఘ ఉపవాసానికి పరలోకంలో ఇఫ్తార్ చేయాలన్నది ఇస్లాం ఉద్దేశ్యం. పరలోకంలోని ఇఫ్తార్ చాలా గొప్పగా ఉంటుంది, అక్కడ మనిషి ఈ ప్రపంచంలో ఊహించలేని వాటిని పొందుతాడు.

ఈ ప్రపంచంలో, దేవుడు మనిషికి పరిమిత జీవితాన్ని మాత్రమే ఇచ్చాడు, కానీ అతని కోరికలు అపరిమితమైనవి. ఈ ప్రపంచంలో తనకు ఎటువంటి నష్టం, దుఃఖం ఉండరాదని, రోగాల పాలబడరాదని, ముసలితనం రాకూడదని, ఎల్లప్పుడూ యవ్వనంగా ఉండాలని, మరణం ఎప్పుడూ రాకూడదని మనిషి అభిలషిస్తాడు. ఈ ప్రపంచంలో ఏ ఒక్కరికైనా ఈ కోరికలు

**నమాజ్ మనిషిని దేవునితో కలుపుతుంది. చెడుల నుంచి, అశ్లీలమైన పనుల నుంచి నిరోధిస్తుంది. ఉపవాసం మనిషిలో ఆత్మనిగ్రహం, నైతిక క్రమశిక్షణను సృష్టిస్తుంది. దీనివల్ల మనిషి తన మనోవాంఛలను అదుపులో ఉంచుకుని, పాపాలకు అపరాధాలకు దూరంగా ఉంటాడు. జకాత్ వ్యవస్థ సమాజంలోని బలహీనులకు ఆసరా ఇచ్చి, స్వంత కాళ్లపై నిలబడేలా చేస్తుంది. అందువల్లనే నెల రోజుల పాటు ఉపవాసాల ద్వారా, ప్రతి రోజూ పన్నెండు నుండి పద్నాలుగు గంటల సమయంలో అనుక్షణం మనిషి దేవుడు తనను చూస్తున్నాడనే స్పృహతో నైతిక శిక్షణ పొందుతాడు.**

ఎప్పటికైనా నెరవేరుతాయా? దేవుడు నెరవేరుతాయనే అంటున్నాడు, కాని ఈ ప్రపంచంలో కాదు, పరలోకంలో. ఈ ప్రపంచ జీవితంలో ఒక ఉపవాసుల్లా జీవించిన వారికి మాత్రమే అవి నెరవేరుతాయి. అనుక్షణం దేవుని అవిధేయతకు దూరంగా బతకాలి. తమ సృష్టికర్త అనుమతించబడిన మార్గాల ద్వారా మాత్రమే తమ కోరికలను తీర్చుకునే వారికి పరలోకంలో బహుమతి లభిస్తుంది. అక్కడ వారు స్వర్గం రూపంలో తమ జీవితకాల ఉపవాసానికి దేవుని సమక్షంలో గొప్ప ఇఫ్తార్ చేస్తారు. సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఉండే ఉపవాసం ఒకటి. తెల్లవారుజాముకు ముందు సహరీ (ఉపవాసానికి ముందు భోజనం) చేసి, సూర్యాస్తమయం తర్వాత ఇఫ్తార్ (ఉపవాస విరమణ) చేస్తారు. రెండవ ఉపవాసం రమజాన్ నెల రోజులు ఉంటుంది. ఈ నెల రోజుల ఉపవాసానికి షవ్వాల్ మొదటి రోజున ఇఫ్తార్ చేస్తారు. ఈ ఇఫ్తార్ ఈదుల్ ఫిత్ర్. ఇది సంతోషాల రోజు. ఆ రోజు ఉపవాసం ఉండటం నిషిద్ధం. మూడవ ఉపవాసం మొత్తం ప్రాపంచిక జీవితమంతా పాటించే ఉపవాసం. భయభక్తులతో బతకడమే ఈ ఉపవాసమని చెప్పవచ్చు. విశ్వాసి దేవుణ్ణి కలిసిన రోజున ఈ ఉపవాసానికి ఇఫ్తార్ ఉంటుంది. ఈ ఇఫ్తార్‌లో, అతని మనసు కోరే సమస్తము లభిస్తుంది.

ఒక హదీసులో ఉపవాసికి రెండు ఆనందాలు ఉన్నాయని, ఒకటి, అతను ఇఫ్తార్ చేసినప్పుడు లభించే ఆనందమైతే, రెండవది దేవుణ్ణి కలిసినప్పుడు, దేవుడు అతనికి ప్రతిఫలం ఇచ్చినప్పుడు లభించే ఆనందం అని చెప్పబడింది. (మిష్కాత్ 1959).

రమజాన్ ఉపవాసాలు జీవితాంతం ఉండే పెద్ద ఉపవాసానికి సహాయపడతాయి. ఈ వాస్తవాన్ని గుర్తుంచుకుంటే, రమజాన్ ముగిసిన తర్వాత ముస్లింలు రమజాన్ ప్రభావాలను కొనసాగించ గలరు. ఈద్ నమాజు తర్వాత కూడా మస్జిదులు కళకళ లాడ తాయి. రమజాన్ తర్వాత కూడా సదాచరణల సుగంధం గుబాళిస్తూనే ఉంటుంది. రమజాన్‌కు ముందు, ఉద్దేశపూర్వకంగా లేదా అనుకోకుండా చేసిన పాపాల కారణంగా మనం నరకానికి దగ్గరయ్యాము. ఆచరణల ప్రకారం నరకానికి అర్హులమయ్యాము. కాని రమజానులో మన ఉపవాసాలు, నమాజులకు ప్రతిఫలంగా అల్లాహ్ ప్రతిరోజూ మన పాపాలను క్షమిస్తూ, మన పుణ్యాలను 70 రెట్లు పెంచుతూ వచ్చాడు. అంతేకాకుండా, అల్లాహ్ ముస్లిం సమాజానికి లైలతుల్ ఖద్ర్ అనే గొప్ప బహుమతిని ప్రసాదిం చాడు. ఎవరికైతే ఆరాధనతో నిండిన లైలతుల్ ఖద్ర్ లభించిందో, అతను చాలా అదృష్టవంతుడు. ఎందుకంటే, ఆ ఒక్క రాత్రి ఆరాధనకు ప్రతిఫలంగా, 83 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం అల్లాహ్ విధేయతలో గడిపిన జీవితానికి సమానమైన పుణ్యాలను పొందుతాడు. ఈ విధంగా, రమజాన్ ముగిసేనాటికి అల్లాహ్ మనల్ని నరకాగ్ని నుండి కాపాడి, స్వర్గానికి యోగ్యులయ్యేలా చేస్తాడు. ఈ యోగ్యతను కోల్పోవడాన్ని మనం ఇష్టపడతామా? తదుపరి రమజాన్ పొందే ఆశతో, కోరికల వెంబడి పరుగులు పెడుతూ, భయభక్తుల మార్గం నుండి వైదొలిగే సాహసం చేయ గలమా? తదుపరి రమజాన్ ఖచ్చితంగా మనకు లభిస్తుందా? భయభక్తులు కేవలం రమజానుకు మాత్రమే పరిమితమా? మనం రమజానులో మాత్రమే అల్లాహ్‌ను విశ్వసించే దాసులమా? రమజాను తర్వాత పదకొండు నెలలు షైతాన్ మార్గాన్ని అనుసరిస్తామా? స్వర్గానికి అర్హతను కోల్పోయి నరకాన్ని కొనుక్కునే పనుల ద్వారా అల్లాహ్ అనుగ్రహాలకు కృతజ్ఞతలు చెల్లిస్తామా? అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**చూడడానికి కళ్ళను ఇచ్చిన దేవుని అనుగ్రహానికి సరైన పద్ధతిలో కృతజ్ఞతలు చెప్పుకోవడమంటే, కళ్ళ ద్వారా దేవుని అవిధేయతకు పాల్పడకుండా ఉండడం. అలాగే దివ్యఖుర్‌ఆన్ దేవుని అనుగ్రహం. ఈ అనుగ్రహానికి సరైన పద్ధతిలో కృతజ్ఞతలు తెలుపడమంటే రమజాన్ తరువాత కూడా ఖుర్‌ఆన్ పట్ల మన బాధ్యతలను నెరవేర్చడం.**

"సన్మార్గానికి బదులు వక్రమార్గాన్నీ, క్షమాభిక్షకు బదులు ఘోరశిక్షనూ కొనుక్కున్న వారు వీరు. ఎంత ధైర్యం వీరికి, నరక శిక్షను సైతం భరించటానికి సిద్ధంగా ఉన్నారు!" (బఖర: 175)

రమజానులో ఉపవాసాల ఒక లక్ష్యం భయభక్తులను సంపాదిం చడం. రమజాన్ తర్వాత భయభక్తులు అవసరం లేదా? రెండవ లక్ష్యం ఖుర్‌ఆన్ అవతరణకు కృతజ్ఞతలు తెలుపడం. రమజాన్ తరువాత ఈ కృతజ్ఞతలు అవసరం లేదా? కృతజ్ఞతలు తెలుపుకునే సరైన పద్ధతి ఏమిటంటే, దైవానుగ్రహాలను సరైన రీతిలో ఉపయోగించుకోవడం. చూడడానికి కళ్ళను ఇచ్చిన దేవుని అనుగ్రహానికి సరైన పద్ధతిలో కృతజ్ఞతలు చెప్పుకోవడమంటే, కళ్ళ ద్వారా దేవుని అవిధేయతకు పాల్పడకుండా ఉండడం. అలాగే దివ్యఖుర్‌ఆన్ దేవుని అనుగ్రహం. ఈ అనుగ్రహానికి సరైన పద్ధతిలో కృతజ్ఞతలు తెలుపడమంటే రమజాన్ తరువాత కూడా ఖుర్‌ఆన్ పట్ల మన బాధ్యతలను నెరవేర్చడం. రమజాన్ మాసం దివ్య ఖుర్‌ఆన్‌తో పటిష్టమైన బంధాన్ని ఏర్పరచింది. ఈ సంబంధాన్ని అదేవిధంగా కొనసాగించాలి. రోజుకు ఒకట్రెండు వాక్యాలైనా గాని అర్థం చేసుకుంటూ చదవాలి. రమజాన్ ఉపవాసాల మూడవ లక్ష్యం ఏమిటంటే, ఉపవాసాల ద్వారా అల్లాహ్ ఔన్నత్యాన్ని మన జీవితంలో స్థాపించుకున్నాము. రమజాన్ మాసంలో అల్లాహ్ అభీష్టానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, అల్లాహ్‌ను మహోన్న తుడిగా చాటి చెప్పాము. ఆయన మన కోరికల కంటే, ప్రపంచంలో అన్నింటికంటే గొప్పవాడు. ఈదుల్ ఫిత్ర్ రోజున బిగ్గరగా దైవస్తోత్రం చేయడం ద్వారా నోటితో కూడా అల్లాహ్ ఔన్నత్యాన్ని ప్రకటించాము. రమజాన్ మాసంలో అల్లాహ్ ఔన్నత్యాన్ని ప్రకటించి, ఈద్ ముగిసిన వెంటనే మన సమాజం ఆచరణలో అల్లాహ్ (అల్లాహ్ క్షమించుగాక) అల్పత్వాన్ని ప్రదర్శించేదిగా మారడం సముచితమేనా?

మన జీవితమంతా ఉపవాసిగా బతకాలనే స్పృహ మనలో పెరగాలి. భయభక్తుల జీవితం అంటే ఉపవాసి స్వభావంతో దైవారాధనల్లో, దైవవిధేయతలో గడపడం. రమజాన్ మాసంలో రోజంతా ఉపవాసం ఉన్నామనే విషయం గుర్తుండేది. అదేవిధంగా, మనం జీవితకాల ఉపవాసం పాటిస్తున్నామని, అల్లాహ్‌ను కలిసిన రోజున ఈ ఉపవాసానికి ఇఫ్తార్ ఉంటుందని, అక్కడ అల్లాహ్ మనల్ని స్వాగతించి ఆతిథ్యం ఇస్తాడని గుర్తుంచుకోవాలి. "ఇవీ మీకు లభించే ఆతిథ్యపు ఏర్పాట్లు, క్షమాశీలుడు, కరుణామయుడూ అయిన దేవుని వైపు నుండి."(హామీమ్ సజ్దా: 32). ఈ ఆతిథ్యానికి సంబంధించిన ఒక దృశ్యం ఏమిటంటే, అల్లాహ్ స్వయంగా తన సన్నిహిత దాసులకు పరిశుద్ధ మధువును అందిస్తాడు. "వారి ప్రభువు వారికి ఎంతో పరిశుద్ధమైన మద్యాన్ని ప్రసాదిస్తాడు." (అద్ దహ్ర్: 21)

❖

# స్నేహ ధర్మం

- నసీరా బేగం

ప్రపంచంలోని ప్రతి మనిషికి స్నేహితులు ఉండటం చాలా అవసరం. స్నేహితుల్లేని మనిషి అంటూ ఎవరూ ఉండలేరు, ఉండడు కూడా అంటే అది అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. సాధారణంగా మనం చూస్తూ ఉంటాము; మనిషి ఒక చోట నుండి మరొకచోటికి, ఒక దేశం నుంచి మరొక దేశానికి ఒంటరిగా పయనిస్తాడు. అక్కడికి చేరుకున్న తరువాత తన నిత్యావసరాలను అన్వేషిస్తూ తనతో ఎవరైనా స్నేహం చేస్తారా అని అన్వేషిస్తూ ఉంటాడు. ఈ అన్వేషణలో అతను సఫలీకృతుడు కూడా అవుతాడు. కొంతమందితో అతను స్నేహాన్ని ఏర్పరచుకుంటాడు. ఎందుకంటే మనిషి సంఘజీవి, ఒంటరిగా జీవించటం అతని స్వభావానికి వ్యతిరేకం. సాధారణంగా మనం ధనం లేనివాడిని అగత్యపరుడు అని భావిస్తాము. కాని అసలు అగత్యపరుడు స్నేహితులు లేనివాడు అని చెప్పడం జరిగింది. ధనంలేని కారణంగా కష్టాలు తప్పకుండా వస్తాయి. కాని అతనికి స్నేహితులు లేకపోయి నట్లయితే దానికోసం అతను ఒంటరి పోరాటాన్ని సాగించాలి. నిజమైన స్నేహితులు స్నేహితుని జీవితానికి శోభను ప్రసాదిస్తారు. జీవితపు ప్రయాణంలో అండగా ఉంటారు; సుఖ దుఃఖాలను పంచుకుంటారు. కనుకనే నిజమైన స్నేహితులు దేవుని తరపు నుండి ప్రసాదించబడిన వరం అని అంటారు. కనుక స్నేహితులతో ప్రేమగా మెలగాలి, వారితో ప్రేమించబడాలి. ఈ సుగుణం ఎవరిలోనైతే ఉంటుందో అతను అత్యంత అదృష్టవంతుడు. ఎవరి స్నేహితులైతే అతన్ని కలవడా నికి, అతనితో మాట్లాడటానికి, అతనితో సమయం గడపటానికి ఇష్టపడరో అతను అత్యంత దురదృష్టవంతుడు.

అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు; విశ్వాసులైన పురుషులు, విశ్వాసులైన స్త్రీలు వారందరూ ఒకరికొకరు సహచరులు (9: 71) దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; విశ్వాసి ఆపాద మస్తకం ప్రేమామృతాలను కలిగినవాడు. ఇతరులను ప్రేమించనివానిలో, ఇతరులతో ప్రేమింపబడనివానిలో ఎలాంటి మేలు, ఎలాంటి మంచితనమూ ఉండదు. (మిష్కాత్) దైవప్రవక్త(స) తమ సహచరులతో, తమ స్నేహితులతో అత్యంత ప్రేమగా మెలిగేవారు. ప్రతి ఒక్కరూ దైవప్రవక్త(స) నన్ను మాత్రమే అధికంగా ప్రేమిస్తారు. నేనే ఆయన(స)కు ప్రత్యేకం అని భావించేవారు.

హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్(ర) ఇలా అన్నారు; దైవప్రవక్త(స) నాతో అత్యంత శ్రద్ధతో, ప్రేమతో మాట్లాడేవారు. దాని కారణంగా నేను నా జాతికి చెందిన వారందరిలో ఉత్తముణ్ణి అని భావించేవాణ్ణి. ఒకసారి నేను “ఓ దైవప్రవక్తా(స)! నేను ఉత్తముణ్ణా! లేక హజ్రత్ అబూబకర్ (రజి) గారు ఉత్తములా?” అని అడిగాను. దానికి దైవ ప్రవక్త(స), హజ్రత్ అబూబకర్(ర) అని సెలవిచ్చారు. దాని తరువాత “నేను ఉత్తముణ్ణా లేక హజ్రత్ ఉమర్(ర)గారు ఉత్తములా?” అని అడిగాను. దానికి ఆయన(స) హజ్రత్ ఉమర్(ర) అని సెలవిచ్చారు. ఆ తరువాత “హజ్రత్ ఉస్మాన్(ర) గారు ఉత్తములా లేక నేనా?” అని అడిగాను. ఆయన(స) హజ్రత్ ఉస్మాన్(ర) అని సెలవిచ్చారు. దైవ ప్రవక్త (స) గారి స్పష్టమైన సమాధానానికి నేను సిగ్గు పడ్డాను. అంటే దైవప్రవక్త(స) గారి ప్రేమపూరితమైన ప్రవర్తనకు మనిషి తనను తాను అందరికంటే గొప్పవాణ్ణి, దగ్గరివాణ్ణి అని భావించే స్థితికి చేరుకునేవాడు.

ఇంకా మనిషి స్నేహితులతో కలసిమెలసి ఉన్నప్పుడు కొన్ని కష్టనష్టాలకు కూడా గురి కావచ్చు. వాటన్నింటినీ సహనంతో, వివేకంతో, దూరదృష్టితో అధిగమించాలి. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; “ప్రజలతో కలసిమెలిసి ఉంటూ వారి ద్వారా కలిగే కష్టాలను, బాధలను సహించే ఒక ముస్లిమ్, ప్రజల ద్వారా కలిగే కష్టనష్టాల పట్ల అసహనాన్ని వ్యక్తం చేస్తూ వారికి దూరంగా ఉండే ఒక ముస్లిమ్‌కంటే ఉత్తముడు”. (తిర్మిజీ)

ప్రజలతో స్నేహం చేసేటప్పుడు కొన్ని విషయాలను దృష్టిలో ఉంచుకోవటం తప్పనిసరి. ఎందుకంటే సన్మార్గాన్ని సూచించే వారు స్నేహితులే. దుష్టమార్గాన్ని బోధించేవారూ స్నేహితులే. కనుక మంచి స్నేహితులను ఎన్నుకోవాలి. లేదా తాను స్నేహితులను మంచి వ్యక్తులుగా మార్చగలగాలి. ఏ వ్యక్తి మంచితనాన్నయినా అంచనా వేయాలంటే అన్నిటికంటే ముందు అతని స్నేహితులను చూడాలి అని చెప్పటం జరిగింది. దైవప్రవక్త(స) గారు కూడా ఇలా సెలవిచ్చారు; మనిషి అతని స్నేహితుని ధర్మంపై ఉంటాడు. కనుక ప్రతి మనిషి అతను ఎవనితో స్నేహం చేస్తున్నాడో బాగా ఆలోచించి స్నేహం చెయ్యాలి. (మస్నద్ అహ్మద్)

సజ్జనులైన స్నేహితులు ఇహలోకంలోనే కాదు పరలోకంలో కూడా గౌరవప్రదమైన స్థానాలకు చేరుకోవటంలో తోడ్పడతారు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : దైవ దాసులలో కొంతమంది ఉంటారు. వారు దైవప్రవక్తలూ కారు, అమరగతిని పొందిన వారూ కారు. కాని ప్రళయదినాన వారికి మహోన్నతమైన స్థానాలు ప్రసాదించబడతాయి. వాటిని ప్రవక్తలు, షహీదులు చూసి ఆశ్చర్యచకితులయ్యారు. దైవప్రవక్త(స) గారి సహచరులు, ఓ దైవప్రవక్తా! వారు ఎవరై ఉంటారు? అని విన్నవించుకున్నారు. దానికి ఆయన (స) ఇలా సెలవిచ్చారు : వారు కేవలం దైవ ధర్మం కోసం ఒకరినొకరు ప్రేమించుకునేవారు. వారి మధ్య ఎలాంటి బంధుత్వమూ ఉండదు. ఇచ్చిపుచ్చుకోవడాలు కూడా ఉండేవి కావు. వ్యాపార లావాదేవీలు కూడా లేవు. దైవసాక్షిగా! ప్రళయదినం నాడు వారి ముఖాలు కాంతివంతంగా మెరిసిపోతూ ఉంటాయి. వారు ఆపాద మస్తకం కాంతివంతంగా ఉంటారు. ప్రజలందరూ ఆనాడు భయంతో వణికిపోతూ ఉంటే వారికి ఎలాంటి భయమూ ఉండదు. ప్రజలందరూ బాధకు గురై ఉంటే వారికి ఎలాంటి బాధా ఉండదు. (అబూ దావూద్)

ఒక స్నేహితుడు మరొక స్నేహితుణ్ణి కలుసుకోవడానికి వెళ్ళటంపై కూడా దేవుడు శుభవార్తలనిచ్చాడు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : ఒక వ్యక్తి తన స్నేహితుణ్ణి కలవటానికి వేరే ప్రాంతానికి వెళ్ళాడు. దేవుడు అతను వెళ్ళే దారిలో ఒక దైవదూతను కూర్చోబెట్టాడు. ఆ దైవ దూత అతనితో ఎక్కడికి వెళుతున్నావు అని అడిగాడు. దానికి నేను ఫలానా ప్రాంతంలో ఉండే నా స్నేహితుణ్ణి కలవటానికి వెళుతున్నాను అని సమాధానం పలికాడు. దానికి దైవదూత అతను నీకు ఏమైనా ఇవ్వాలా? అని అడిగాడు. దానికి ఆ వ్యక్తి కాదు, నేను అల్లాహ్ కోసం అతణ్ణి ప్రేమిస్తాను. దాని కారణంగా అతన్ని కలుసుకోవటానికి వెళుతున్నాను. దానికి దైవదూత ఇలా అన్నాడు; నాకు అల్లాహ్ ఒక శుభవార్తను ఇచ్చి పంపాడు; నీవు కేవలం అల్లాహ్ కోసం అతనితో ప్రేమించిన కారణంగా అల్లాహ్ కూడా నిన్ను అదేవిధంగా ప్రేమిస్తున్నాడు. (ముస్లిమ్)

పూర్వకాలంలో ప్రజలు తమ స్నేహితులను ఎక్కువగా గౌరవించే వారు, ప్రేమించేవారు. వారి గౌరవాభిమానాలలో చిత్తశుద్ధి అధికంగా ఉండేది. దాని కారణంగా వారి కోసం త్యాగాలు కూడా చేసేవారు. హజ్రత్ ముహమ్మద్ బిన్ జియాద్(ర) ఇలా సెలవిచ్చారు; నేను మా పెద్దల జీవితాన్ని చూశాను. వారు ఉమ్మడిగా, ప్రేమగా కలిసిమెలిసి జీవించేవారు. ఎవరి వద్దనైనా వారి బంధువులు, స్నేహితులు వచ్చినట్లయితే తోటివారు చేసుకున్న వంటలను తీసుకొచ్చి వారికి వడ్డించేవారు. వండిన వారు మా అన్నం ఎవరు తీసుకుపోయారు అని వెతికేవారు. అప్పుడు వారికి అసలు విషయం తెలిసేది. వారి అనుమతి తీసు కోకుండానే వారి భోజనం తీసుకున్నందుకు కోపగించుకునే బదులు సంతోషించేవారు.

మన స్నేహితులను మనం ప్రేమించే విషయాన్ని వారికి బహిరంగ పరచాలి. దాని ద్వారా వారి మనసుకు ప్రశాంతత కలుగుతుంది. సంతోషంతో నిండుకుంటుంది. ప్రేమ చిత్తశుద్ధిలోకి రూపాంతరం చెందుతుంది. ఒకసారి దైవప్రవక్త(స), ఆయన(స)తోపాటు కొంతమంది సహచరులు కూర్చొని ఉన్నారు. అంతలో ఒక వ్యక్తి వారి ముందు నుంచి వెళ్ళాడు. అక్కడ కూర్చుని ఉన్నవారిలో నుంచి ఒక వ్యక్తి, 'ఓ దైవప్రవక్తా(స)! నేను కేవలం అల్లాహ్ కోసం ఆయన్ని ప్రేమిస్తున్నాను' అన్నాడు. దానికి దైవప్రవక్త(స) ఈ విషయాన్ని అతని ముందు బహిరంగపరిచావా? అని అడిగారు. దానికి అతను లేదు అని సమాధానమిచ్చాడు. "అయితే లే లేచి వెళ్ళి ఆ విషయాన్ని చెప్పు" అని దైవప్రవక్త(స) ఆదేశించారు. అతను వెంటనే లేచి పరుగెత్తుకుని వెళ్ళి తన ప్రేమను బహిరంగ పరిచాడు. దానికి సమాధానంగా అతను నీవు నన్ను అల్లాహ్ కోసం ప్రేమించావు కాబట్టి అల్లాహ్ కూడా నిన్ను ప్రేమించు గాక! అని సమాధానమిచ్చాడు. (తిర్మిజీ)

అయితే స్నేహం చెయ్యటంలో దేవుడు విధించిన హద్దులను అతిక్రమించకూడదు. స్త్రీలు స్త్రీలతోనే స్నేహం చెయ్యాలి. పురుషులు పురుషులతోనే స్నేహం చెయ్యాలి. స్నేహితులను ప్రేమించిన కారణంగా వారి ఇండ్లల్లో హద్దులను అతిక్రమించి జొరబడకూడదు. పరదాకు సంబంధించిన ఆజ్ఞలను జ్ఞాపకం ఉంచుకోవాలి. స్నేహితులను అతిగా ప్రేమించి బంధుత్వాలను విస్మరించకూడదు. సాధారణంగా స్నేహితుల్లో మునిగిపోయి రాత్రుళ్ళు ఆలస్యంగా ఇళ్ళకు చేరటం, భార్యా పిల్లలను మరచిపోవటం, చెడు అలవాట్లకు లోనవటం లాంటివన్నీ గర్హనీయం. వీటిపై అల్లాహ్ కూడా ఆగ్రహోదగ్రుడవుతాడు. సమాన దృష్టిని కలిగి ఉండాలి. అందరికీ సమానంగా సహాయ సహకారాలు అందించాలి.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది        ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

37 ఆయత్‌లు

# 45. అల్ జాసియ

మక్కా అవతరణ

23 మరెప్పుడయినా నీవు ఆ వ్యక్తి పరిస్థితిని కూడా గమనించావా? అతను తన మనోకాంక్షను తన దైవంగా చేసుకున్నాడు,[30] జ్ఞానం ఉన్నప్పటికీ[31] అల్లాహ్ అతన్ని మార్గవిహీనతలో పడవేశాడు. ఇంకా అతని చెవులు, గుండెపైన ముద్రవేశాడు, అతని కళ్ళపైన తెరవేశాడు.[32] అల్లాహ్ తరువాత ఇప్పుడెవరున్నారని అతనికి మార్గ బోధన చేయడానికి? మీరు ఎటువంటి గుణపాఠమూ గ్రహించరా?

30. మనోకాంక్షను దైవంగా చేసుకోవడమంటే ఉద్దేశం, మనిషి తన కాంక్షలకు దాసుడయిపోవడం అన్నమాట. తన మనస్సు కావాలని కోరిన పనిని అతను చేసివేయడం, అది దైవం నిషేధించిన పనయినాసరే. అతని మనసు చేయగోరని పనిని చేయకపోవడం, అది దైవం విధిగా నిర్ణయించిన పనయినాసరే. మనిషి ఇలా దేనికయినా విధేయత పాటించడం మొదలిడినట్లయితే దాని అర్థం అతని ఆరాధ్యుడు దైవం కాదు, ఎవరి విధేయత అతను పాటిస్తూ ఉన్నాడో ఆ శక్తియే అతని దైవం, అతను నోటితో దాన్ని తన దైవమని, ఆరాధ్యుడని ప్రకటించినా ప్రకటించకపోయినా; దాని విగ్రహం చేసి పూజించినా పూజించకపోయినా సరే. ఏ విధంగానూ ప్రశ్నించకుండా పాటించే విధేయత మటుకే చాలు అది ఆరాధ్యశక్తి అయిపోవడానికి. ఈ ఆచరణాత్మక బహుదైవారాధన తరువాత, మనిషి కేవలం నోటితో తాను విధేయత పాటించే శక్తిని తన ఆరాధ్యుడు అని చెప్పకపోయినా, దానికి సజ్దా చేస్తూ మోకరిల్లకపోయినా బహుదైవారాధనా అపరాధం నుండి అతను విడుదల పొందలేడు. ఈ ఆయత్‌ను, ఇతర ప్రముఖ వ్యాఖ్యాతలు సయితం ఇదే విధంగా వివరించారు. ఇబ్ను జరీర్ దీని భావాన్ని ఇలా తెలుపుతున్నారు, "అతను తన మనోకాంక్షను తన ఆరాధ్య దైవంగా చేసుకున్నాడు. అతని మనసు దేనిని కోరితే దానిని నిర్వర్తించాడు, అల్లాహ్ హరామ్ చేసిన దాన్ని హరామ్‌గా పరిగణించలేదు, ఆయన హలాల్ చేసినదాన్ని హలాల్‌గా పరిగణించలేదు." అబూబక్ర్ జస్సాస్ దీని అర్థాన్ని ఇలా తెలిపారు, "దేవునికి విధేయత పాటించినట్లుగా అతను మనోకాంక్షను అనుసరిస్తాడు." జమఖ్‌షరీ దీన్ని ఇలా వివరిస్తారు, "అతను మనోకాంక్షకు పరమ విధేయుడు, అతని మనసు ఎటు పిలిస్తే అటు పోతాడు. అంటే, ఒక వ్యక్తి తన దైవానికి దాస్యం చేసినట్లుగా అతను తన కాంక్షల దాస్యం చేస్తాడన్నమాట." (మరిన్ని వివరాలకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం. 5, అల్ ఫుర్కాన్: పాదసూచి 56; సం. 6, సబా: పాద సూచి 62; సం. 7, యాసీన్: పాదసూచి 53, అష్ షూరా: పాద సూచి 38).

31. మూలంలోని పదాలు **"అజల్లహుల్లాహు అలా ఇల్మిన్"** అన్నవి. వీటికి ఒక భావం, ఆ వ్యక్తి పండితుడయినప్పటికీ మనోకాంక్షల దాసుడయిపోయాడు గనక అల్లాహ్ పక్షంగా మార్గవిహీనతలో పడవేయబడ్డాడు. రెండవ భావం ఇదీ సాధ్యమే, 'అతను తన మనోకాంక్షను తన దైవంగా చేసుకున్నాడు' అన్న తన జ్ఞానం ఆధారంగా అల్లాహ్ అతన్ని మార్గవిహీనతలో పడవేశాడు.

32. అల్లాహ్ ఒకరిని మార్గవిహీనతలో పడవేయటం, అతని మనస్సు, చెవులపైన ముద్రవేయడం, అతని కళ్ళకు తెరలు కప్పడం అంటే భావమేమిటో మేము ఈ గ్రంథంలో లోగడ అనేకచోట్ల వివరించాము. చూడండి ఖుర్‌ఆన్ అవగాహనం, సం. 1, అల్ బకర: పాద సూచికలు 10, 16; సం. 2, అల్ అన్ ఆమ్: పాద సూచికలు 17, 27; సం. 3, అల్ ఆరాఫ్: పాదసూచి 80; అత్ తౌబా: పాదసూచికలు 89, 93 యూనుస్: పాదసూచి 71; సం. 4, అర్ రా'ద్: పాదసూచి 44; ఇబ్రాహీమ్: పాదసూచికలు 6, 7, 40 అన్ నహ్ల్: పాదసూచి 110; బనీ ఇస్రాయీల్: పాదసూచి 51; సం. 6, అర్ రూమ్: పాదసూచి 84; ఫాతిర్: ఆయత్ 8, పాద సూచికలు 16, 17, అల్ మూమిన్: పాద సూచి 54).

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా॰ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## యమన్ నుండి అష్అరీ తెగవారి రాక

**(వీరు ఖైబర్ విజయం సందర్భంగా ఒక బృందం రూపంలో- హిజ్రీ 7లో- దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరయ్యారు) అప్పుడు అబూ మూసా అష్అరీ (రజి) దైవప్రవక్త(స)తో, 'అష్అరీ తెగవారు నా వారు. నేను వారిలోని వాణ్ణి' అన్నారు.**

**243)** అబూ మూసా అష్అరీ (రజి) ఇలా అన్నారు: నేనూ, నా సోదరుడైన అబూ రహమ్(లేదా అబూ బర్దా) యమన్ నుండి వచ్చిన కొత్తలో – చాలా రోజుల వరకు – ఇబ్నె మస్ఊద్(రజి)ను, ఆయన తల్లి ఉమ్మె అబ్దుల్లాహ్ (ర.అ)ను దైవ ప్రవక్త(స) కుటుంబ సభ్యులని తలపోసేవారం. ఎందుకంటే వారిద్దరూ రేయింబవళ్ళలో అనేకసార్లు ప్రవక్త(స) ఇంటికి వస్తూ పోతుండేవారు. ఎల్లవేళలా దైవ ప్రవక్త(స)ను వెన్నంటి ఉండేవారు.[1]

**244)** అబూ ఖిలాబాతో జహ్దమ్ ఇలా అన్నారు: అబూ మూసా అష్అరీ(రజి) గారు మహనీయ ఉస్మాన్ (రజి) ఖిలాఫత్ కాలంలో కూఫా అధికారిగా నియమితులై వచ్చినప్పుడు, జర్మ్ తెగ వారికి ఆయన ఎంతో మర్యాద చేశారు- జహ్దమ్ ఇలా అన్నారు: మేము ఆయన వద్ద కూర్చుని ఉన్న సమయంలో, ఆయన కోడి కూరతో ఉదయపు భోజనం (టిఫిన్) చేస్తున్నారు. అక్కడ కూర్చుని ఉన్న వారిలో ఒకతన్ని (పేరు తెలియలేదు) కూడా అబూ మూసా భోజనానికి పిలిచారు. కాని ఆ వ్యక్తి సున్నితంగా తిరస్కరిస్తూ, 'కోడి పెంట తింటూ ఉండగా నేను చూశాను. అప్పటి నుండీ కోడి మాంసం పట్ల నాకు ఏవగింపు కలిగింద'ని అన్నాడు. దానికి అబూ మూసా, "చాల్లెద్దూ, నీ చాదస్తం గాని దైవప్రవక్త(స) కోడి మాంసం తింటూ ఉండగా నేను స్వయంగా చూశాన"ని అన్నారు. కాని ఆ వ్యక్తి కోడిమాంసం తిననని ఒట్టేసుకుని ఉన్నాడు. కాని అబూ మూసా(రజి) పట్టుబడుతూ, "సరే లేవయ్యా! నీ ప్రమాణ భంగానికి చికిత్స నేను చెబుతాను. ముందు నువ్వు వచ్చి భోజనం చెయ్యి. ఒకసారి ఏమయిందంటే; మేము అష్అర్ తెగకు చెందిన కొంతమందిమి కలిసి దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై, (తబూక్ యుద్ధ ప్రయాణం కొరకు) కొన్ని వాహనాలను సమకూర్చమని అభ్యర్థించాము. "మీకు ఇవ్వడానికి వాహనాలు లేవు" అని దైవప్రవక్త(స) చెప్పారు. మేము మరోసారి కూడా వాహనాలను ఇవ్వమని ఆయన్ని కోరగా, "దైవసాక్షిగా! నేను మీకు వాహనాలను సమకూర్చలేన"ని ఆయన(స) మాకు బదులిచ్చారు. కాని కొద్ది సమయమైనా గడవకముందే యుద్ధప్రాప్తి క్రింద కొన్ని ఒంటెలు వచ్చాయి. దైవప్రవక్త(స) ఆ ఒంటెలలో నుండి ఐదింటిని మాకు ఇప్పించారు. మేము వాటిని స్వీకరించాము కూడా. కాని కొన్ని క్షణాల తర్వాత 'అయ్యో! మేము దైవప్రవక్త(స)ను మోసపుచ్చాము కదా! ఆయన్ని పరధ్యానంలో ఉంచాము. ఆయన ఒట్టేసుకున్న సంగతిని మనం ఆయనకు గుర్తు చేయ లేదు. ఇట్టి పరిస్థితిలో మాకు మేలు అన్నది జరగద'ని చెప్పుకుని తిరిగి ఆయన(స) సన్నిధికి వెళ్ళాము. 'దైవప్రవక్తా! మాకు వాహనాలు సమకూర్చలేనని తమరు ప్రమాణం చేసి మరీ చెప్పారు కదా! కాని తరువాత మాకు వాహనాలు ఇచ్చారు' అని విన్నవించుకున్నాము. దానికి ప్రవక్త మహోదయులు (స), "నిజమేననుకోండి. కాని నేను ఎప్పుడు ప్రమాణం చేసినా, దానికన్నా మేలైన మార్గం నా ముందుకు వచ్చినప్పుడు, నేను మేలైన దానినే చేస్తాను (అయితే ప్రమాణ భంగానికి గాను పరిహారం ఇస్తాను)" అన్నారు.

243-1. హజ్రత్ అబూ మూసా అష్అరీ(రజి) మొదట కొంతమంది యమనీలతోపాటు అబిసీనియా దేశానికి వలసపోయారు. తరువాత అక్కణ్ణుంచి జాఫర్ బిన్ అబూ తాలిబ్(రజి)తో కలసి దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చారు.

# ఈజిప్టు పరిస్థితులు, టర్కీ అనుభవాలు - గుణపాఠాలు



మూడవ భాగము

అనువాదం - కె.ఎం.ఎ. సుబ్‌హాన్

**(సయ్యద్ సాదతుల్లా హుసైనీ పుస్తకం “ఇఖామతె దీన్ కీ షాహ్‌రాహ్” నుంచి....)**

**(గత సంచిక తరువాయి)**

మినరల్ వాటర్ తయారు చేస్తుంది. పెట్రోల్ పంపులను నిర్వహిస్తుంది. (కోయిన్ బ్రాండ్ పాస్తా, సాఫీ మినరల్ వాటర్, లుత్నియా పెట్రోల్ పంపులు, అన్ని ఈజిప్టు సైన్యం నిర్వహించే వ్యాపార సంస్థలు) దేశంలోని అనేక ప్రాంతాలలో ఇతర బ్రాండ్ (ఇందులో దేశీయ బ్రాండ్‌లూ ఉన్నాయి) వస్తువులను నిషేధిస్తుంది. ఇందుకు బలప్రయోగం చేస్తుంది. ఈ పనిని ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తుంది. ఈ సైనిక జనరల్‌లు ప్రభుత్వం నుండి, ఇందుకు పెద్ద ఎత్తున ఆర్థిక ప్యాకేజీలు పొందుతారు. నేడు ప్రధాన నగరాలలోని అత్యంత విలువైన వ్యాపార ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలు, ఇంకా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు పెద్ద భాగం ఈజిప్టు సైనికుల హస్తగతంలో ఉన్నాయి. సూయజ్ కంపెనీ చైర్మెన్ నిత్యం ఎవరో ఒక సైనిక అధికారిగానే ఉంటాడు. ఈ విధంగా సైన్యం , దేశంలోని రాజకీయ, ఆర్థిక, మీడియా, న్యాయ వ్యవస్థల వంటి ఇతర వ్యవస్థలన్నింటినీ పూర్తిగా తన కంట్రోల్‌లో ఉంచుకొని ఉంది. ఈ కంట్రోల్ ద్వారా అంతర్జాతీయ పెట్టుబడిదారీ దోపిడీ శక్తులకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ ఉంటుంది. ఈ విధంగా సైన్యం అసలు ఉద్దేశ్యం పూర్తిగా మార్చివేయబడింది. ఈ స్థితినే మనం ‘డీప్‌స్టేట్’ అని పిలుస్తున్నాం. (Holger Albrecht ; Aurel Croissant, Fred Lawson ; - Armies and Insurgencies in the Arab Spring ; University of Pennysylvania press ; Philadelphia - 2016, Pages - 185-202).

ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇస్లామీయ ఉద్యమాలు ఇక్కడ తమ పనిని ప్రారంభించాయి. అప్పుడు ఈ ‘డీప్‌స్టేట్’ వర్గం ఆధునిక పాశ్చాత్య సభ్యతా సంస్కృతికి పూర్తి మద్దతుదారుగా ఉండింది. ఇస్లామీయ ఉద్యమాలతో ధార్మికత, ధర్మం, వగైరాల పట్ల తీవ్ర నిరసన భావం కలిగి ఉండింది. మరి ఉద్యమాలు సైతం, వీరిని లిబరల్స్ అని, పాశ్చాత్య సమర్థకులని తీర్మానించి వీరిని నిర్లక్ష్యం చేశాయి. ఈ వర్గమే నేడు ఇస్లామీయ ఉద్యమాలకు ప్రధాన అవరోధంగా నిలిచి ఉంది.

దివంగత అర్బకాన్ గారి ఒక ప్రత్యేకత ఏమంటే ఆయన అత్యంత సహనం, స్థైర్యంతో ఈ వర్గాన్ని (ఇందులో మేధావులు, సమాజంలో ప్రభావశీలురులుగా ఉన్న ఆధునికులు, వాణిజ్య వ్యాపారవేత్తలు, బ్యూరోక్రసీలోని పైస్థాయి అధికారులు, సైనికాధికారులలోని నిజాయితీపరులు – దేశప్రేమికులు) లక్ష్యంగా చేసుకొని తన ప్రయత్నాలు సాగించారు. MUSAID లాంటి సంస్థలను స్థాపించి, వ్యాపార వాణిజ్యవేత్తల మెజారిటీని అటువైపు ఆకర్షింపచేశారు. విభిన్న సాంకేతిక నిపుణులను (Professionals) సమీకరించేందుకు

విభిన్న సంస్థలను స్థాపించారు. అటు సైనికులలోనూ పని ప్రారంభించారు. విద్యావంతులు, మేధావులు, తదితరులతో పని చేశారు. ఈ పనిలో అనుకున్నంత స్థాయి విజయం సాధించారు. ఈ విజయం సాధించబడినందువల్లనే నేడు ఉర్దగాన్‌కు మార్గం సుగమం అయ్యింది.

ఈజిప్టులో ఇఖ్వాన్‌కు ఇంకా ఈ 'డీప్‌స్టేట్'పై నియంత్రణ సాధించడం కుదరలేదు. ఇఖ్వాన్ సమర్థకులలో డాక్టర్లు, ఇంజనీర్లు, ఇతర సాంకేతిక నిపుణుల మెజారిటీ ఉంది. ఇఖ్వాన్ నాయకులు అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన యూనివర్శిటీలల్లో చదివినవారుగానూ, అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన యూనివర్శిటీలల్లో ఉన్నతస్థాయి విద్యను ఆర్జించినవారుగానూ ఉన్నారు. అయినా 'డీప్‌స్టేట్'లో స్థానం పూర్తిస్థాయిలో ఇఖ్వాన్ పొందలేకపోయింది. సమీక్షకులు, విమర్శకులు చేసిన మూల్యాంకనం; ఇఖ్వాన్ తన కార్యకర్తలను అద్భుతమైన Actvist లుగా తయారు చేసింది. మేధావి వర్గాన్ని ప్రభావితం చేసింది. గొప్ప గొప్ప ఉపన్యాసకులను (Preachers) తయారు చేసింది. వారికి అద్భుతమైన శిక్షణ గరిపింది కాని, సామాజిక రంగంలోని ప్రభావశీల వర్గంతో ఎక్కువ సంబంధాలు పెట్టుకోలేకపోయింది. ఈ దేశీయ వర్గాన్ని తన ప్రభావంలోకి తీసుకోలేకపోయింది.

ఈ పరిస్థితుల నేపథ్యం మనకు కూడా, ఈ వర్గంపై ప్రత్యేకంగా పని చేయాల్సి ఉందనే పాఠాన్ని నేర్పుతుంది. మనదేశంలో కూడా ఇస్లామీయ ఉద్యమం కొన్ని పరిమిత సమూహాల వరకే పరిమితమై ఉంది. క్రింది స్థాయి శ్రామిక ప్రజల వరకు గాని, అటు మేధావుల వరకు గాని, మన ఉద్యమం ఇంకా చేరలేదని, ప్రభుత్వాధికారులపై గాని, ప్రణాళికా తయారీ వర్గాలపై గాని, మన ఉద్యమ ప్రభావం అస్సలు లేదు. ఇక ప్రభావశీల వర్గాల వరకు మన ఉద్యమ సందేశం చేరనేలేదు. ఇందుకోసం ప్రణాళికబద్ధ ఆచరణ చేయవలసి ఉంది. ఇక ముస్లిం సమాజంలోనూ మన పని ధృఢమైన నిష్ఠతో, ప్రణాళికాబద్ధంగా జరగవలసి ఉంది. మన సాంప్రదాయక దృష్టికోణం, మనల్ని క్రియాశీలక పని విధానంవైపుకు మళ్ళనీయడం లేదు. మన పనిలో క్రియాశీలత, జాగరూకత అవసరం. ఉద్యమ అవసరాల పరిపూర్తి కోసం అవసరమైన పనిని చేయవలసి ఉంది. మన క్యాడర్‌లో ఈ క్రియాశీలక చైతన్యం కలిగించవలసిన అవసరం నేడు ఎంతైనా వుంది. ఇందుకు అవసరమైన శిక్షణ జరపవలసిన అవసరం మరెంతో ఉంది.

టర్కీ అనుభవం ఒక వైపున ఉండగా, నా దృష్టిలో ప్రస్తుతం మలేషియాలో అద్భుతంగా ఈ ప్రయోగం విజయవంతం అవుతూ ఉన్నట్లు కన్పిస్తుంది. అక్కడ ABIM ద్వారా అక్కడి పెద్దపెద్ద వ్యాపారస్తులు, ప్రభుత్వాధికారులు, వాణిజ్యవేత్తలు, ప్రొఫెషనల్స్‌తో ధృఢమైన సంబంధాలు ఏర్పర్చబడుతున్నాయి. వారిని అక్కడి ఇస్లామీయ ఉద్యమంతో పరిచయం చేయించబడుతూ ఉంది.

## 2) ఇస్లాం అభిమానులను విభజించటం :

ఈరాన్ ఇస్లామీయ ఉద్యమ విజయ కాలంలో ప్రజలందరి ఆశ అభిలాష ఒక్కటిగా ఉండింది. ప్రజలందరూ ఇస్లామీయ ఉద్యమాన్ని ప్రేమించే వారుగా, సహకరించే వారుగా ఒక్క ఉమ్మత్‌గా ఉండేవారు. ఒకే ప్రాణం, ఒకే వరుసగా ఉద్యమంలో నిలిచారు. కాని, ప్రస్తుతం ముస్లిం ఉమ్మత్ అంతర్జాతీయంగా మూడు పెద్ద పెద్ద గ్రూపులలో విభజించబడి ఉంది. షియా ఇస్లాం అభిమానులు–వీరికి నాయకులుగా ఈరాన్, హిజ్బుల్లాలు ఉన్నారు. సలఫీ ఇస్లాం అభిమానులు – వీరికి సౌదీ అరేబియా ప్రభుత్వం నాయకత్వం వహిస్తూ వుంది. ఇంకా ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న సలఫీ సంస్థలూ ఉన్నాయి. ఇస్లామీయ ఉద్యమాభిమానులు – వీరికి ఇఖ్వానుల్ ముస్లిమీన్, జమాఅతె ఇస్లామి, ఇంకా సయ్యద్ ఖుతుబ్ షహీద్ రహ్మ, హసనుల్‌బన్నా షహీద్ రహ్మ, ఇమామ్ మౌదూదీ రహ్మల దృకృథంతో ప్రభావితమైన ఉద్యమ సంస్థలు నాయకత్వం వహిస్తున్నాయి. (మరో నాలుగవ సమూహం కూడా ఉంది. ఇది తీవ్రవాదాన్ని తమ ధృకృథంగా కలిగి ఉంది. దీనికి అనేక సంస్థలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో నాయకత్వం వహిస్తున్నాయి. వీరి ఆచరణ ద్వారా ఇస్లాంకు లాభం జరగకపోగా, నష్టమే అధికంగా జరుగుతుంది. వీరి పునాదులు ఇస్లాంతో పూర్తిగా విభేదిస్తున్నాయి కూడా. అందుకనే వీరిని నేను మన విభజనలో స్థానం కల్పించలేదు) అంతర్జాతీయ ఆధిపత్య శక్తులు ఈ విభజనను శాశ్వతంగా ఉంచాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇంకా విభజించబడాలని, వీరి మధ్య మరింత అగాధం పెంచాలని కుట్రలు ప్రతినిత్యం చేస్తున్నారు. షియా ఇస్లాం అభిమానాన్ని ఇరాన్ జాతి ప్రయోజనాలతోనూ, సలఫీ ఇస్లాం అభిమానాన్ని సౌదీరాజరిక వంశ ప్రయోజనాలతోనూ ముడిపెట్టడం జరుగుతుంది.

నా ఈ సూత్రీకరణ పట్ల భిన్నాభిప్రాయం కలిగి ఉండవచ్చు. ఇఖ్వాన్ ఇస్లామీయ ఉద్యమం. ఇస్లాం అభిమానుల పై రెండు బృందాలను, రెండు పాయలను అనుసంధానం చేయలేకపోయింది. చిన్న చిన్న భిన్నాభిప్రాయాలపై పైరెండు సమహాలను దూరం చేసుకోవడం జరిగింది. ఈ ఐక్యత సాధించబడకుండా రాచరిక వ్యవస్థ అంతర్జాతీయ ఇస్లాం వ్యతిరేక శక్తులు తీవ్రంగా పనిచేస్తున్నాయి, అనేది అక్షరసత్యం. అయినా ఇస్లామీయ ఉద్యమం తనవైపు నుంచి చేయవలసినంత కృషి చేయలేదనేది కూడా కాదనలేని సత్యం. ఇప్పటికీ ఈ అవకాశాలు మెండుగానే ఉన్నాయి.

సిరియా దేశంలోని రాజకీయ సమస్య, షియా–సున్నీల ఉద్యమాలను

మరింత దూరం చేసింది. వారి మధ్య అగాధాన్ని మరింత పెంచింది. ఈరాన్ హిజ్బుల్లాలు సిరియా డిక్టేటర్‌కు మద్దతుదారులుగా నిలిచాయి. ఈ నియంత క్రూరమైన దాడులకు, అణచివేతలకు ఇఖ్వాన్‌ల ఇస్లామీ ఉద్యమం టార్గెట్ అయ్యింది. మరోవైపున ఈజిప్టులో జరిగిన రాజకీయమార్పులు, సైనిక తిరుగుబాటుకు, ప్రజాస్వామిక ముర్సీ రహ్మ పరిపాలనను రద్దుచేసి, ఆయనను ఖైదు చేయటంలోనూ సౌదీ అరేబియా రాజవంశం, వారి అధికారపు మద్దతు ఉండింది. సలఫీలకు మార్గదర్శకాలు ఈ కేంద్రం నుండియే అందేవి. ఈ కఠోర వాస్తవాలు ఎన్ని ఉన్నప్పటికీ ఇస్లామీయ ఉద్యమం ఈ విధంగా విభజనకు అవకాశం ఇవ్వకూడదనేది నా నిశ్చితాభిప్రాయం. షియా, సలఫీ ఉద్యమాల నాయకత్వంతో చర్చలు డైలాగ్‌ను రానున్న కాలంలో ఇస్లామీయ ఉద్యమకారులు తమ ప్రథమ కర్తవ్యంగా చేసుకోవలసి వుంది.

టర్కీ ఈ విషయంగా ప్రత్యేకించి సఫలత సాధించినట్లు కనపడుతుంది. టర్కీ ఇస్లామీయ ఉద్యమ విజయ రహస్యం ఏమంటే, అది తన్ను తాను, ఈ మస్లకీ (School of thoughts అను) నుండి, ఫిర్ఖాబంది నుండి లేక మక్తబ్‌ల నుండి ఉన్నతంగా ఎదిగింది. తన్ను తాను విముక్తం చేసుకుంది. పై వారందరిని ఉద్యమానికి సమీపంగా చేసుకుంది. ఇస్లామీయ ఉద్యమానికి మద్దతుదారులుగా మలుచుకుంది. మౌలానా రూమీ (రహ్మ) ధార్మికపీఠంతో సంబంధం గల సూఫీ తాత్విక దృక్పథం గలవారి నుండి, దర్వేషీలు, చివరికి సలఫీల వరకు అందరినీ ఇస్లామీయ ఉద్యమానికి దగ్గర చేసింది. ఇక గ్రామీణ ప్రాంత ప్రజల నుండి పట్టణ, నగర ప్రజలవరకు గల ఇస్లామీయ మద్దతురాలుందరినీ ఐక్యపర్చింది. తనకు మద్దతుదారుగా నిలుపుకొంది. వీరందరి ప్రతినిధులు నేడు ఉర్దగాన్ పార్టీలో ఉన్నారు. ఈరాన్‌లో ఉర్దగాన్ విమర్శింపబడతారు. కాని ఆయన నమ్మకమైన స్నేహితుని స్థానంలో ఉన్నారు. ఈ రెండు దేశాల వాణిజ్యం ఒక బిలియన్ డాలర్ల నుండి ఎదిగి నేడు 30 బిలియన్ డాలర్లకు చేరుకుంది. చర్చలు, డైలాగ్ ద్వారా మనమధ్య ఉన్న భిన్నాభిప్రాయాలను అధిగమించవచ్చని ఈ అనుభవం తెలుపుతుంది. షియా ప్రపంచంతో ఎన్ని విభేదాలు ఉన్నా మిత్రుత్వం కొనసాగించవచ్చని టర్కీ ఈరాన్‌లు నేడు రుజువు చేశాయి. ఇదే విధంగా టర్కీ ఇటు సలఫీల సహకారం పొందడంలోనూ సఫలత సాధించింది. టర్కీ గృహమంత్రి అహ్మద్ దావూద్ ఉగ్లూ గత ఏడాది జరిగిన పర్యాటకుల సమావేశంలో ఈ ఐక్యత విషయంపై దృఢంగా స్పందించారు. షియా, సలఫీ, సూఫీ సున్నీల మధ్య వైషమ్యాల ప్రభావం నుండి ఇస్లాం ప్రపంచాన్ని దూరంగా ఉంచాలని ఆయన ఉద్ఘాటించారు. టర్కీ ఈ పాలసీని విజయవంతంగా అమలు చేయగలిగింది. సిరియా దేశంలో టర్కీ జోక్యాన్ని షియాలు ఎంతగా విమర్శించినా, ఉర్దగాన్ పట్ల వారి గౌరవం, ఆమోదంలో ఏమాత్రం కొరత ఏర్పడలేదు. ఇదే పరిస్థితి ఇటు అరబ్బు ప్రాంతంలోనూ ఉంది.

మనదేశంలో కూడా ఇస్లాం అభిమానులు, అనేక గ్రూపులుగా విభజింపబడి ఉన్నారు. మనం కేవలం ఉపరితలాంశాలకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చి, లేక నిర్మాణాత్మకాలకే ప్రాధాన్యతనిచ్చి, పని చేస్తే, ఈ గ్రూపుల మధ్య మరింత దూరం, అగాధం, పెరిగిపోక తప్పదు. మన లక్ష్యం, ధ్యేయం (Cause)లకు నష్టదాయకం అవుతుంది. మన విశాలమైన ఆలోచనలు, విశాలమైన హృదయం, విశాలమైన పని విధానం, ఈ భిన్నత్వాలన్నింటినీ, వైషమ్యాలన్నింటినీ తొలగించి ఐక్యత సాధించగలుగుతుంది.

## 3) ఇస్లామీయ ఉద్యమకారులను, సాధారణ ముస్లిం నుండి వేరుపర్చే కుట్ర :

ఇస్లామీయ ఉద్యమాలు ప్రపంచ వ్యాపితంగా దృఢమైన నిర్మాణాత్మక కేడర్ కలిగి పనిచేస్తున్నాయి. నిత్యం ఒకే ఐడియాలజీ కలిగి ఉంటాయి. ఈ ఐడియాలజీ పునాదులపైనే తమ కార్యకర్తలకు సైద్ధాంతిక, ఆచరణాత్మక, ఆధ్యాత్మిక శిక్షణలు ప్రత్యేకంగా అందిస్తూ ఉంటాయి. ఈ శిక్షణ ఆయా ఉద్యమాలకు శక్తిని అందిస్తుంది. అయితే ఈ ప్రత్యేక శిక్షణల ద్వారా సదరు కార్యకర్తలలో ఒక విధమైన ఆధిపత్య భావం (Superiority Complex) జనిస్తుంది. తాము తప్ప మిగిలిన వారంతా తప్పు అనే సంకుచిత భావన, అహంకారం తలెత్తుతుంది. ఒక విధమైన విభజనరేఖ గీయబడుతుంది. ఇస్లామీయ వ్యతిరేకశక్తులు ఈ విషయాన్నే తమ బలమైన ఆయుధంగా వాడుకుంటున్నాయి. ఉద్యమ కార్యకర్తలు తమ్ముతాము నైతిక విలువల వీరులుగా తలుస్తారు. సమాజంలోని ఇతరులు అంతటి నైతికత లేనివారుగా వీరికి కనపడతారు. తాము చైతన్యవంతులుగానూ, ప్రజలను చైతన్యరహితులుగా తలుస్తారు. తమకే లక్ష్యం ఉంది. ఇతరులు లక్ష్యరహితులు. తమ ఉద్యమ కార్యకర్తలే సమర్థులు, ఇతరులు అసమర్థులు. వీరు మాత్రమే నమ్మకస్తులు కనుక ప్రతి విషయంలోనూ నాయకత్వం వీరివద్దనే ఉండాలి. అది రాజకీయమైనా, ట్రస్టులు అయినా, ఇతర సంస్థల బాధ్యతలైనా తమకే దక్కాలి. చివరకు వృత్తినైపుణ్యం అవసరమైన చోట కూడా తమ ఆధిపత్యమే కొనసాగాలి. ప్రాధాన్యతల విషయంలో అధిక ప్రాధాన్యత తమకే దక్కాలని భావిస్తారు.

ఇక ఉద్యమ కార్యకర్తలలోనూ ఈ ఆధిక్యతా భావం ప్రొఫెషనలిజమ్‌కు అడ్డంకిగా తయారవుతుంది. నైపుణ్యం కల వారిని సైతం వీరు గుర్తించ నిరాకరిస్తారు. ఇతరులలోని వృత్తి నైపుణ్యాన్ని, ప్రతిభను గుర్తించ నిరాకరిస్తారు. తామే సుశిక్షితులమని భావిస్తారు. ఈ విధంగా ఉద్యమాలలోనికి ఇతరులను రానివ్వరు. వారిని నమ్మరు. అన్ని పనులూ తామే చేయాలని, చేయగలరని తలుస్తారు. ఫలితంగా వీరు సంస్థాగత పక్షపాతానికి గురౌతారు. ఆధ్యాత్మిక ఆధిక్యతా భావానికి గురౌతారు. తమ సంస్థ కేవలం తమకు మాత్రమేనని తలుస్తారు. తమ సంస్థ మొత్తం ప్రజలకు బాధ్యత వహిస్తుందని గుర్తించరు.

**(మిగతా వచ్చే సంచికలో)**

3

# కుటుంబ వ్యవస్థను కాపాడుకుందాం!



సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**గత సంచిక తరువాయి**

పూర్వం సంతానాన్ని మూడు కారణాల చేత చంపేసేవారు. 1) లేమి, పేదరిక భయంతో. 2) అవమాన భయంతో. 3) మూఢ నమ్మకాల ప్రభావంతో.

మరి నేటి పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగానూ, ఒకింత విడ్డూరం గానూ ఉంది. వీరి సంతోషంలో వారు అడ్డు తగులుతున్నారని ఆస్తి, అంతస్తు అన్నీ ఉన్నా స్వకామ, స్వక్షేమ, స్వలోభ దాహానికి పిల్లల్ని దారి కంపలుగా భావించి తొలగించుకోవాలనుకుంటు న్నారు. విచిత్రమేమిటంటే, ఈ కర్కశత్వం నిరుపేదలకన్నా ధనికుల్లో ఎక్కువగా ఉంది. పామరులకన్నా బాగా చదువు, కొలువున్నవారిలో ఎక్కువగా ఉంది. అల్లాహ్ పై వచనంలో - సంతాన హత్య మహా నేరం, ఆ నేరానికి మీరు పాల్పడకండి అన్నాడు. మరి సంతాన హత్య అంటే కేవలం భ్రూణ హత్యలు మాత్రమే కాదు, సంతానం కలిగిన మీదట చంపడం మాత్రమే కాదు. అసలు సంతానమే వద్దనుకోవడం దానికి మించిన నేరం, మహా పాపం. నిజంగా దీన్ని మొత్తం మానవాళి హత్యగా పరిగణించాల్సి ఉంటుంది.

## డింక్ జీవన విధానపు విపరిణామాలు

వయసొచ్చాక సమస్య - ఉడుకు రక్తం ఉరకలేస్తున్నప్పుడు ఎవరికీ ఎవరి అవసరమూ ఉండదు. కానీ.. ఒక వయసొచ్చాక నా అనుకునేవాళ్లు లేకపోతే.. బాగా ఇబ్బందిగా ఉంటుంది. కనీసం సొంత పనులు కూడా చేసుకోలేని పరిస్థితిలో ఉన్నప్పుడు తోడుండేది పిల్లలే. పిల్లలకు చిన్నప్పుడు అందించిన సంరక్షణకు గాను తిరిగి కృతజ్ఞత చూపించే పిల్లల పల్ల వచ్చే సంతృప్తిని వీరు అసలు అనుభవించలేరు.

భాగస్వామిని కోల్పోతే.. భార్యాభర్తలు అయినంత మాత్రాన ఇద్దరూ ఒకేసారి చనిపోరు కదా! కాబట్టి వాళ్లలో ఒకరు చనిపోతే.. రెండవవారు ఆ వయసులో తోడులేక చాలా ఇబ్బంది పడాల్సి ఉంటుంది. చేతిలో డబ్బు ఉండడం వల్ల అన్ని సౌకర్యాలు దొరుకుతాయి. కానీ.. తోడునిచ్చే నీడని మాత్రం కొనుక్కోలేం. కాబట్టి పిల్లలు ఉండడమే ఉత్తమం అంటున్నారు అనుభవజ్ఞులు.

## బంధం నిలబడాలంటే పిల్లలే ఆధారం

లైఫ్ పార్టనర్‌తో ఏదైనా గొడవైనా, ఇంకేదైనా సమస్య వచ్చినా విడిపోతుంటారు. కానీ,, పిల్లలు ఉంటే విడాకులు తీసుకోవ డానికి ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. ఎందుకంటే.. విడాకులు తీసుకుంటే పిల్లలు తండ్రి లేదా తల్లి ప్రేమకు దూరమవుతారు. అందుకే భార్యాభర్తల్ని కలిపి ఉండేలా చేసేది పిల్లలే అంటారు పెద్దలు. వారే లేకపోతె పెళ్లికి కట్టిన ఆ మావిడాకులు "మా" (మా అబ్బాయి, మా అమ్మాయి) అనే బంధం లేని కారణంగా ఒట్టి విడాకులుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

**“ఆచరణ రీత్యా అందరికంటే ఎక్కువ నష్టపోయే వారెవరో నేను మీకు తెలుపనా? ప్రపంచ జీవితంలో తమ కృషి, శక్తిసామర్థ్యాలన్నీ సన్మార్గం తప్పి వృథా అవుతున్నా సరే, తాము అంతా మంచే**

చేస్తున్నామని భావించే వారే ఎక్కువ నష్టపోయేవారు". (అల్-కహఫ్: 103-104)

అయితే,

### "అనుకున్నామని జరగవు అన్నీ"

అనుకున్నంతనే అన్నీ అయిపోవు. కోరినంతనే ఘన విజయాలు వచ్చి ఒడిలో వాలవు. అందుకోసం ఎంతో శ్రమించాలి. ఓపిగ్గా కష్టనష్టాలకు ఎదురీదాలి. చిన్న మొక్క ఎన్నో ఏళ్లు పెరిగి మహా వృక్షమై చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తుంది. సూర్యోదయాన్ని ఆస్వాదించాలంటే చీకటిని భరించాల్సిందే. ఓర్పు వహిస్తేనే అనుకున్నది సాధించగలం.

ముందుగా మనిషికి తనపై తనకు నమ్మకం ఉండాలి. నేటి యువతలో సహించే, భరించే గుణాలు అంతరించిపోతున్నాయి. వాటి స్థానంలో పంతాలు, పట్టింపులు, కోపతాపాలు తిష్ట వేసి పచ్చని కాపురాల్లో నిప్పులు పోస్తున్నాయి. కుటుంబ వ్యవస్థను కూకటి వ్రేళ్ళతో పెకలించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

సంసారపు సాగరంలో ఈదక తప్పని జీవన యాత్రికులమే మనమందరం. ఎవడి నావ వాడిదే...ఎవడి చుక్కాని వాడికే. ఏ శిక్షణా లేని అనుభవమూ తెలియని నావికులమే మనమందరం. సాగరమంటేనే మరి అలల తాకిడి... ఒకదాని వెంట ఒకటి.. ఒకదాన్ని మించి ఒకటి... ఎప్పుడు ఏ ఉప్పెన ఎటునుండి ముంచుకొచ్చేనో! అయినా అది తప్పని ఎదురీత...భయపడి ఆగిపోయావా.. ధైర్యమని చుక్కానిని వదిలేసినా నడి సంద్రాన నిట్టనిలువునా మునిగిపోవటమే!

### తల్లిదండ్రులుగా ఆత్మావలోకనం

**నేనతనికి అపార సిరిసంపదలు ప్రసాదించాను. అతడ్ని ఎల్లప్పుడూ వెన్నంటి ఉండే కొడుకుల్ని కూడా ఇచ్చాను. సుఖసంతోషాలకు కావల్సిన జీవన సామగ్రినంతా ఇచ్చాను. (అల్-ముదస్సిర్: 12-14)**

సంతానమంటే అనుగ్రహం మాత్రమే కాదు, సంతానమంటే బాధ్యత కూడా. ఆ బాధ్యత గురించి మనందరినీ నిలదీయడం కూడా జరుగుతుంది. ఆ రోజు ఈ సౌఖ్యాలు, సిరిసంపదలను గురించి మిమ్మల్ని తప్పక ప్రశ్నించటం జరుగుతుంది. (అత్-తకాసుర్: 8)

మనం బాగుండి మన సంతానం కూడా బాగుంటే అది మన జీవిత అలంకారం. మనకు సంతానం పట్ల ప్రేమ మితిమీరినా, వారు త్రోవ తప్పినా అది మన జీవిత పరీక్ష. మనకు ఆశలు, ఆశయాలు వద్దు గానీ ఆస్తులు మాత్రం కావాలనుకునే భార్యా

**'తోడూ నీడ'**

**భాగస్వామిని కోల్పోతే.. భార్యాభర్తలు అయినంత మాత్రాన ఇద్దరూ ఒకేసారి చనిపోరు కదా! కాబట్టి వాళ్లలో ఒకరు చనిపోతే.. రెండవవారు ఆ వయసులో తోడులేక చాలా ఇబ్బంది పడాల్సి ఉంటుంది. చేతిలో డబ్బు ఉండడం వల్ల అన్ని సౌకర్యాలు దొరుకుతాయి. కానీ.. తోడునిచ్చే నీడని మాత్రం కొనుక్కోలేం.**

పిల్లలుంటే - అది మన జీవితానికి ప్రమాద ఘంటిక. ఈ మూడింటిని అల్లాహ్ అందరికీ అర్థమయ్యేలా ఖుర్ఆన్లో పేర్కొన్నాడు.

**1) ఈ సంతానం, సిరిసంపదలు ప్రాపంచిక జీవితపు అలంకారాలు. (అల్-కహఫ్: 46)**

**2) నిశ్చయంగా, మీ సంపదలు, మీ సంతానం మీ పాలిట ఒక పరీక్ష. మరియు అల్లాహ్! ఆయన దగ్గర గొప్ప ప్రతిఫలం (స్వర్గం) ఉంది. (అత్-తగాబున్: 15)**

**3) ఓ విశ్వాసులారా! నిశ్చయంగా, మీ జీవిత భాగస్వాముల్లో, మీ సంతానంలో మీ శత్రువులు ఉండవచ్చు! కావున మీరు వారిపట్ల జాగ్రత్త వహించండి. కాని ఒకవేళ మీరు వారి అపరాధాన్ని మన్నించి వారిని ఉపేక్షించి వారిని క్షమించితే! నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత (అని తెలుసుకోండి). (అత్-తగాబున్: 14)**

ఈనాడు మన పిల్లలు ఇలా తయారవుతున్నారంటే దానికి ఎక్కడో ఒక చోట మనం కూడా కారకులం ఏమో - ప్రతి తల్లిదండ్రులు ఆత్మ విమర్శన చేసుకోవాలి. ఎందుకంటే, నేల మంచిదయితే పాడి- పంట. నేల చెడ్డదయితే పాడయిన పంట. అదే చెబుతున్నాడు అల్లాహ్.

**సారవంతమైన నేల తన ప్రభువు అనుజ్ఞతో పుష్కలంగా మంచి పంటనిస్తుంది. సారంలేని చవుడునేల నాసిరకాన్నే ఉత్పత్తి చేస్తుంది. అదేవిధంగా మేము కృతజ్ఞులయిన వారి కోసం మా సూక్తులు, సూచనలను మాటిమాటికి విశదీకరిస్తున్నాము. (అల్-ఆరాఫ్: 58)**

మమత-సమతల మణిదీపమే అమ్మ, అవ్యాజానురాగ ఆపన్న హస్తమే నాన్న. ఒక విత్తనం మొక్కై, చెట్టై, మహావృక్షంగా మారి ఫలవంతం కావాలంటే మొట్టమొదట కావలసింది గాలి, నీరు,

**అనుకున్నంతనే అన్నీ అయిపోవు. కోరినంతనే ఘన విజయాలు వచ్చి ఒడిలో వాలవు. అందుకోసం ఎంతో శ్రమించాలి. ఓపిగ్గా కష్టనష్టాలకు ఎదురీదాలి. చిన్న మొక్క ఎన్నో ఏళ్లు పెరిగి మహా వృక్షమై చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తుంది. సూర్యోదయాన్ని ఆస్వాదించాలంటే చీకటిని భరించాల్సిందే. ఓర్పు వహిస్తేనే అనుకున్నది సాధించగలం.**

ఎండ, ఎరువు కాదు. కావలసింది సారవంతమైన 'భూమి'. ఆ తరువాతే మిగిలినవన్నీ. అలాగే ఒక పిల్లవాడు బుద్ధిమంతుడు, విద్యావంతుడు, విజ్ఞానవంతుడు కావాలంటే 'ఇల్లే' వ్యక్తిత్వ వికాస పాఠాలు నేర్పే వేదిక కావాలి. తల్లి తండ్రులే అందుకు ఉత్తమ గురువులుగా మారాలి.

నాన్న నమ్మకం! అమ్మ నిజం! నమ్మక, నిజాల ప్రతి రూపం సంతానం. బలాలు ఉన్నట్లే ఎంతటి పేరు ప్రఖ్యాతులున్న మనిషికైనా బలహీనతలూ కొన్ని ఉంటాయి. అవి అతడికి పరీక్ష పెడుతుంటాయి. ఏదో ఒక సందర్భంలో ఇతరులకు పెట్టిస్తుంటాయి. వారు ఆ బలహీనతలతో ఆడుకుంటారు. బలహీనతల కారణంగానే మనిషి మరొకరికి లొంగిపోతాడు. ఒకరికి తిండి బలహీనత, మరొకరికి నిద్ర, ఇంకొకరికి శారీరక సుఖం... ఇలా ఎన్నో బలహీనతలు మనిషిని నిర్వీర్యం చేస్తూ ఉంటాయి. బలహీనతలను దాటిరావడానికి బలం కావాలి. ధైర్యం కావాలి. దైవశక్తి కావాలి. నిజమైన పరిపూర్ణుడైన మనిషిగా బతకాలంటే బలహీనతలు ఉండకూడదు. శరీరంలో, మనసులో తిష్ట వేసుకున్న వాటిని వెళ్లగొట్టాలి. ముందు అవి బయటకుపోతే అప్పుడు మంచి గుణాలతో నింపుకోవచ్చు.

ఇక సంసారమంటేనే ఎడతెగని బాధ్యతల దాడి. బాధ్యతలెంత బరువైనా.. కష్టాలే కూలదోసినా పడుతూ లేస్తూ... ఆటుపోట్లను అధిగమిస్తూ సంసార సాగరపు ఒడిదుడుకులకు తట్టుకుంటూ, పరిస్థితులకు కాలానుగుణంగా ఎదురీదుతూ లక్ష్యాల వైపు ఉరికేవాడే విజయాన్ని పొందగలడు.

### అంతిమంగా

ధర్మం, కామం, అర్థం సమంగా ఉంటే... మోక్షం అనేది కొత్తగా ప్రయత్నించి తెచ్చుకోనక్కర లేదు. అదే వస్తుంది. అంటే ధర్మబద్ధమైన అర్థం, ధర్మబద్ధమైన కామం ఉండాలి. నేను డబ్బు సంపాదిస్తే ధర్మబద్ధంగా సంపాదించానా? ఖర్చు పెడితే.. ధర్మంకోసం ఖర్చు పెట్టానా? నాకు మనసులో ఒక కోరిక పుడితే ఇది ధర్మచట్రంలో ఇముడుతుందా? దీనిని నేను నెరవేర్చుకోవచ్చా?... ఈ ఆత్మవిమర్శన అలవాటయితే అర్థం. కామం ధర్మానికి ముడిపడిపోయినట్టే. ఆ అర్థం, కామానికి కూడా ఒక అర్థం పరమార్థం ఉన్నట్టే. మనిషి జీవితం సార్థకం అయినట్టే.

**విశ్వాసులారా! మీరు అల్లాహ్‌కు సహాయంచేస్తే ఆయన మీకు సహాయం చేస్తాడు. మీ పాదాలను స్థిరంగా ఉంచుతాడు.**

**(ముహమ్మద్: 7)**

కుటుంబం బాగుంటేనే సమాజంలో అందరూ బాగుంటారు. అందులో మనం ఉంటాం. అన్యథా విపరిణామాలు వేరే విధంగా, విధ్వంసకరంగా ఉంటాయి జాగ్రత్త!

**కాబట్టి - విశ్వాసులారా! మీరు మిమ్మల్ని, మీ భార్యాపిల్లల్ని నరకాగ్ని నుండి రక్షించుకోండి. దానికి మానవులు, రాళ్ళు సమిధలవుతారు. అక్కడ దృఢకాయులైన, కఠిన (హృదయులైన) దైవదూతలు (నరక నిర్వాహకులుగా) నియమితులై ఉంటారు. వారు అల్లాహ్ ఆజ్ఞల్ని ఏమాత్రం జవదాటరు. ఏ ఆజ్ఞ వచ్చినా తక్షణమే దాన్ని శిరసావహిస్తారు. (వారు నరకవాసులతో) "అవిశ్వాసులారా! ఈ రోజు మీరు సాకులు చెప్పకండి. మీరెలాంటి కర్మలు చేసుకున్నారో అలాంటి ప్రతిఫలమే మీకివ్వబడుతోంది" అనంటారు. కాబట్టి - విశ్వాసులారా! మీరు మనస్ఫూర్తిగా అల్లాహ్‌కు క్షమాపణ కోరుకోండి. మీ ప్రభువు మీ పాపాలు మన్నించి, మిమ్మల్ని సెలయేరులు పారే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. ఆ రోజు అల్లాహ్ తన ప్రవక్తను, అతనితోపాటు విశ్వసించినవారిని ఎలాంటి అవమానాలకు గురి చేయడు. (అత్-తహ్రీమ్: 6-8)**

**పోతే దైవభీతిపరాయణులు; అక్కడ స్వర్గవనాలు, భోగభాగ్యాలలో ఉంటారు. వారు తమ ప్రభువు ప్రసాదించే మాధుర్యాలను ఆస్వాదిస్తూ సుఖసంతోషాలలో తేలియాడుతారు. వారి ప్రభువు వారిని నరక యాతనల నుండి రక్షించాడు. "ఇక మీరు ఆచరించిన కర్మలకు ప్రతిఫలంగా (నేడు) హాయిగా తినండి, త్రాగండి" అని వారితో అనబడుతుంది.**

**వారక్కడ ఆసనాలపై దిండ్లకానుకొని ఎదురెదురుగా కూర్చొని ఉంటారు. మేము వారికి అందమైన (విశాల) నేత్రాలుగల సుందరాంగులనిచ్చి వివాహం చేస్తాం. విశ్వాసులతోపాటు వారి సంతానం కూడా విశ్వాసంలో వారి అడుగుజాడల్లోనే నడచుకొని ఉంటే, వారిని కూడా మేము (స్వర్గంలో) వారి దగ్గరికి చేర్చుతాం. వారి సుకృత ఫలాన్ని మేము ఏమాత్రం తగ్గించం. ప్రతి మనిషీ తన కర్మలకు తాకట్టుగా ఉన్నాడు. (అత్-తూర్: 17-21)**

**(సమాప్తం)**

# సమాజ సంస్కరణ మనందరి బాధ్యత

మదీహా అర్జుమంద్

**ఈనాడు** సమాజంలో చెడులు, నీతిబాహ్యత విస్తృతి చాలా ప్రబలంగా ఉంది. మానవ జీవితంలోని అన్ని రంగాలను ఈ రుగ్మతలు పరివేష్టించి ఉన్నాయి. చెడులతో పోల్చుకుంటే మంచి మరుగుజ్జులా కనబడుతోంది. నిజానికి మంచి అన్న మేరు పర్వతం ముందు చెడు చీడ పురుగు, పేడ పురుగులా నీచంగా గోచరించవలసింది. కాని దురదృష్టవశాత్తూ దుర్మార్గమే దొడ్డుగా ఉన్నట్లు కనబడుతోంది. ఈ దుస్థితి వెంటనే మారాలి. మార్చాల్సిన బాధ్యత సమాజ శ్రేయోభిలాషులందరిపై ఉంది. ముఖ్యంగా దైవ విశ్వాసులపై మరీ అధికంగా ఉంది. దుర్మార్గాల నిర్మూలన, సత్కార్యాల స్థాపనపైనే మానవాళి సాఫల్యం ఆధారపడి ఉంది. ఈ గురుతరమైన బాధ్యతను గుర్తు చేస్తూ పవిత్ర ఖురాన్ ఇలా అంటోంది:-

'మీలో కొందరు, ప్రజలను మంచి వైపునకు పిలిచేవారు, సత్కార్యాలు చేయమని ఆదేశించేవారు తప్పకుండా ఉండాలి. అలాంటి వారు మాత్రమే ఇహ పర లోకాలలో సాఫల్యం పొందేవారు'.. (3-104). మరొక చోట ఇలా ఉంది : 'ఇక నుండి ప్రపంచ మానవులకు మార్గదర్శనం చేస్తూ వారిని సంస్కరించడానికి రంగంలోకి తీసుకురాబడిన శ్రేష్ఠ సమాజం మీరే.. మీరు సత్కార్యాలు చేయమని ప్రజలను ఆదేశిస్తారు., దుష్కార్యాల నుండి వారిస్తారు. దైవాన్ని ప్రగాఢంగా విశ్వసిస్తారు'. (3-110)

పవిత్ర ఖురాన్‌లోని ఈ వాక్యాల్లో దైవ విశ్వాసుల జీవిత లక్ష్యం ఏమిటో, వారు నిర్వర్తించవలసిన బాధ్యతలేమిటో విశదీకరించటం జరిగింది. దీన్నిబట్టి ప్రతి ఒక్కరు తమ తమ శక్తి సామర్థ్యాల మేరకు సమాజంలో ప్రబలి ఉన్న చెడులను రుగ్మతలను అరికడుతూ, మంచిని, మానవీయ విలువలను వ్యాపింపచేస్తూ ప్రజలను సంస్కరించడానికి కృషి చేయాలని మనకు అర్థమవుతోంది. అందుకే పవిత్ర ఖురాన్, ప్రజల్లో దైవభీతిని, పరలోక చింతనను జనింపజేసి తద్వారా వారిని నీతిమంతులుగా, సత్పౌరులుగా తీర్చిదిద్దాలని అభిలషిస్తోంది. మూఢ నమ్మకాలు, దురాచారాలతో సహా ప్రపంచంలోని అన్నిరకాల చెడులను నిర్మూలించి చక్కని, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పదలిచింది. ఈ లక్ష్య సాధన కొరకు పవిత్ర ఖురాన్ దైవ విశ్వాసులకు మంచిని పెంచే, చెడును నిర్మూలించే బృహత్తర బాధ్యతను నిర్బంధం చేసింది. దీనికోసం దైవ విశ్వాసులు ఒక సంఘటిత శక్తిగా రూపొందాల్సిన ఆవశ్యకతను అది గుర్తు చేస్తోంది.

### నిరంతర కృషి అవసరం

సమాజ సంస్కరణ, సత్సమాజ నిర్మాణం, మానవాళి ఇహపర సాఫల్యం.. దీనికోసమే దైవప్రవక్త ముహమ్మద్(స) వారి కాలంలో, ఆ తరువాతి ఖులఫాయె రాషిదీన్‌ల కాలంలో దైవ విశ్వాసులు ధర్మం కోసం, న్యాయం కోసం తమ సర్వస్వాన్ని ధారపోసి కృషి చేశారు. సమాజంలో ఎక్కడ ఏ కొద్ది చెడు కనిపించినా దాన్ని అంతం చేసేవరకు ప్రశాంతంగా నిద్రపోయేవారు కాదు. ప్రజల్లో పాప భీతిని, దైవభీతిని నూరిపోస్తూ, వారిని దుర్మార్గాలకు దూరంగా ఉంచడానికి ప్రయత్నించేవారు. దీని ఫలితంగా ఆనాడు సమాజంలో ఎల్లెడలా నీతి, న్యాయం, శాంతి, సౌశీల్యం, సౌభ్రాత్రతలు వెల్లివిరిశాయి. ధర్మ పరాయణత, బాధ్యతా భావం, జవాబుదారీ తనం, పరస్పర గౌరవాభిమానాలు సర్వత్రా విస్తరించాయి. నిజంగానే అదొక స్వర్ణ యుగం, ప్రపంచమంతా కీర్తించిన కాంతియుగం. కాని ఆ యుగం అంతరించింది. ఆ కాంతి,శాంతి కనుమరుగై పోయాయి. ఈనాడు ప్రపంచంలో ఎటు చూసినా అరాచకమే రాజ్య మేలుతోంది. అవినీతి, అక్రమాలు, అన్యాయం, అశ్లీలం, మత్తు పదార్థాల సేవనం, హత్యలు, అత్యాచారాలు సర్వ సామాన్యమైపోయాయి. సమాజం అన్నివిధాలా భ్రష్టుపట్టి పోయింది. దీన్ని నిరోధించాల్సిన వారు సైతం చెడుల్లో పీకలదాకా కూరుకుపోయి ఉన్నారు. ఈ దుస్థితి మారాలంటే మనుషుల్లో పరివర్తన రావాలి. ఉదాసీనత వీడాలి. మనకెందుకులే' అన్న వైఖరి మారాలి. చెడులకు వ్యతిరేకంగా గొంతు విప్పాలి. కలసికట్టుగా నడుం బిగించాలి. చెడులు అంతమయ్యే వరకూ అలుపెరుగని పోరాటం కొనసాగిస్తూనే ఉండాలి. బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేర్చాలి. అప్పుడు మాత్రమే సమాజ సంస్కరణ సాధ్యమవుతుంది. ఇహ పర సాఫల్యం సిద్ధిస్తుంది. ❖

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



# ఇస్లాం దృక్పథంలో స్త్రీ

- కవి కరీముల్లా

**సృష్టిలో** మధురమైనది ప్రేమ. ఆ ప్రేమకు ప్రతిరూపం స్త్రీ. మహిళ తల్లిగా, చెల్లిగా, ఇల్లాలిగా, కుమార్తెగా నిర్వహించే భూమిక అనిర్వచనీయమైనది. స్త్రీకి ఇస్లాంలో గొప్ప స్థానం వుంది. స్త్రీల హక్కుల పరిరక్షణ విషయంలో అనేక అంశాలు ఇస్లామీయ శాసనాంగంలో సవివరంగా వున్నాయి. ఇస్లాం స్త్రీని పాపిగానో, శాపగ్రస్తురాలిగానో భావించదు. పురుషునికి ఏ విధమైన హక్కులు వున్నాయో ఆ విధమైన అన్ని హక్కులు స్త్రీకి ఉన్నాయని విశద పరుస్తుంది.

మహాప్రవక్త ముహమ్మద్(స) రాక పూర్వం అరేబియా ద్వీపంలో స్త్రీల పరిస్థితి.. దయనీయమైన స్థితిలో వుండేది. వారి కష్టాలు వర్ణించనలవి కావు. ఖురైష్ తెగకు చెందిన ప్రజలైతే తమకు ఆడపిల్ల పుట్టడం అవమానంగా భావించేవారు. సిగ్గుతో నక్కి నక్కి తిరుగుతూ ఎడారిలో సజీవంగా పాతి పెట్టేసేవారు. (ఇదే పద్ధతి ఆర్థిక కారణాల సాకుతో స్కానింగ్ ద్వారా తెలుసు కుని అబార్షన్ అనే మరో పద్ధతిలో మరో విధంగా దాదాపు అన్ని సమాజాలలోనూ ఇప్పుడూ కొనసాగుతోంది) అరబ్బు సమాజంలో వితంతువుల పట్ల, అనాథల పట్ల జరిగే అత్యాచారాలకు కొదువ వుండేది కాదు. స్త్రీలకు ఏమాత్రం సామాజిక భద్రత లేక అన్ని విధాలుగా అణగద్రొక్కబడి దుర్భర జీవితం గడిపేవారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో దైవప్రవక్త ముహమ్మద్(స) అనేక సంస్కరణలు తెచ్చారు. ఫలితంగా మొత్తం స్త్రీ జాతి వెలుగు కిరణాల్ని చూసింది. కనుకే హెచ్.ఏ.ఆర్. గిబ్ ఇలా అన్నారు:

“ముహమ్మద్(స) తెచ్చిన సంస్కరణలు మొత్తం స్త్రీ జాతి స్థానాన్నే ఉన్నతంగా మార్చివేశాయన్నది విశ్వవ్యాప్తంగా అంగీకృతమైన విషయం” -హెచ్.ఏ.ఆర్. గిబ్ ఆధారం ‘విథర్ ఇస్లాం’.

ముఖ్యంగా మానవ జీవనంలో ఆర్థిక భద్రత కొరవడితే జీవితం సవ్యంగా సాగదు. మొత్తం ఇతరులపై ఆధారపడే దుస్థితి బానిసత్వంలోకి నెట్టి వేస్తుంది. ఇలాంటి దుష్పరిణామాల నుండి ఇస్లాం స్త్రీకి రక్షణ కల్పిస్తుంది. ప్రపంచంలో నాగరికంగా అభివృద్ధి చెందిన దేశాలుగా చెప్పబడే అనేక దేశాలలో ఇప్పటికీ లేని స్త్రీల ఆస్తిహక్కును ఇస్లామ్ 1500 సంవత్సరాల క్రితమే కల్పించింది. పవిత్ర ఖుర్‌ఆన్లో ఓ చోట ఇలావుంది.

“తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచి వెళ్ళిన ఆస్తిలో పురుషులకు భాగం వుంది. తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచి వెళ్ళిన ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం వుంది. అది తక్కువ యినా సరే, ఎక్కువయినా సరే. ఈ భాగం (అల్లాహ్‌చే) నిర్ణయించ బడింది”. పవిత్ర ఖుర్‌ఆన్ (అన్ నిసా - 7)

ఇంకా నికాహ్ (వివాహం) సమయంలో కూడా పురుషుడు మహర్ చెల్లించకుండా స్త్రీని వివాహమాడలేదు. ఈ మహర్ సొమ్ము ఆమె ఆర్థిక భద్రత కొరకు  కేటాయించబడినది. దీనిపై ఆమెకు సర్వాధికారాలు వుంటాయి. ఇస్లాం వరకట్నాన్ని నిషేధించింది. మన నాట ముస్లింల విశ్వాసలోపం కారణంగా ఈ దురాచారం ముస్లిం సమాజంలో కొనసాగుతూ వుండటం దురదృష్టకరం.

మిగిలిన రంగాలలో  సైతం స్త్రీ స్థానాన్ని ఉన్నతం చేయడంలో ఇస్లాం ప్రముఖ పాత్ర వహించింది. బాల్యం నుండి వృద్ధాప్యం వరకు గల అన్ని దశలలోనూ స్త్రీకి గౌరవం ఇవ్వడం జరిగింది. స్త్రీల పట్ల పురుషులలో వుండే చులకన భావాన్ని ఖండిస్తూ మహాప్రవక్త ముహమ్మద్(స) అనేక సందర్భాలలో మాట్లాడేవారు. ఎవరైనా  ఒక విశ్వాసి ఇద్దరు లేక ముగ్గురు తన కుమార్తెలకు మగ పిల్లలతో సమానంగా పెంచి, పోషించి విద్యాబుద్ధులు చెప్పించి ఎటువంటి వివక్ష చూపక మంచి వరునికిచ్చి వివాహం చేస్తే అతనికి స్వర్గ ప్రాప్తి లభిస్తుందని చెప్పారు ఆయన(స). "తల్లి పాదాల క్రింద స్వర్గం వుంది" అని హితబోధ చేశారు. తల్లికి, భార్యకు చేయవల్సిన సేవల పట్ల, వ్యవహరించ వల్సిన తీరుపట్ల ఇస్లాంలో గట్టి తాకీదులు వున్నాయి. ఒక వ్యక్తి దైవప్రవక్త (స) సమక్షంలోకొచ్చి 'ప్రవక్తా! నేను నా తల్లికి అమితంగా సేవలు చేశాను. ఆమెకు ఏనాడు ఏ లోటు రానివ్వలేదు. ఆమె కోరిక మేరకు తట్టలో పెట్టి మోసుకుని హజ్ యాత్ర కూడా చేయించాను.  నేను నా తల్లి ఋణం తీర్చుకున్నట్లేనా' అని అడిగాడు. దానికి దైవప్రవక్త(స) సమాధానమిస్తూ నిన్ను ప్రసవించే సమయంలో ఆమె నోటి నుండి వెలువడిన ఒక అరుపు ఋణం కూడా నీవు  తీర్చుకోలేదు  అని సెలవిచ్చారు. ఇదీ ఇస్లాం మాతృమూర్తికి ఇచ్చిన స్థానం. భార్య విషయంలో ఎలా మెలగాలో హదీస్‌లో చెప్పబడింది.

"ఏ ముస్లిం తన భార్యను అసహ్యించుకోరాదు. ఒకవేళ ఆమెలో ఏదైనా లోపం వుంటే, ఆమెలోని మరో ఉన్నత గుణాన్ని చూసి భర్త సంతోషించాలి."

- దైవ ప్రవక్త ముహమ్మద్ (స)దాదాపు అన్ని విషయాలలోనూ భార్యతో ఎలా మెలగాలో చెప్పారు. ఇస్లాం గృహ హింసను ఖండించింది.

అయితే ఇస్లాంలో స్త్రీకి ఇంత ఔన్నత్యం, ఇన్ని హక్కులు ప్రసాదించబడినప్పటికీ ఆచరణ శూన్యమైన కొందరు ముస్లిం పురుషుల ప్రవర్తన వల్ల అనేక మంది ముస్లిమేతర సోదరులలో అనేక అపోహలు, అనుమానాలు నెలకొన్నాయి. అలాంటి అపోహల్లో ఒకటి తలాక్ (విడాకులు) సమస్య, మూడుసార్లు వెంట వెంటనే పురుషుడు తలాక్ చెప్పేస్తే ఇస్లాంలో విడాకులు తీసుకున్నట్లేనని చాలా మంది భావిస్తుంటారు. కాని ఇది వాస్తవం కాదు. ఇస్లాం విడాకులను అవాంఛనీయమైనదిగా పేర్కొనడమే కాక దంపతులు  తమ మధ్య కలతలు ఏర్పడినపుడు రాజీ సూత్రాన్ని అవలంబించమని చెప్పింది. ఏ పురుషుడైనా తన భార్యకు అన్యాయంగా తలాక్ ఇవ్వడమంటే ఘోరమైన నేరం చేసినట్లేనని హెచ్చరిస్తుంది. పవిత్ర ఖుర్‌ఆన్లో దైవం పురుషులను గురించి ఇలా చెప్పటం జరిగింది.

"అకారణంగా వారిని వేధించటానికి సాకులు  వెతక్కండి గొప్పవాడూ,  అధికుడూ. అయిన అల్లాహ్ పైన ఉన్నాడనే విషయాన్ని తెలుసుకోండి." (అన్ నిసా- 34)

తమ మధ్య పొడసూపిన విబేధాలు ఎలా పరిష్కరించుకోవాలో కూడా దైవం సూచించటం జరిగింది. ఓ చోట ఇలా వుంది-

"భార్యా భర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయనే భయం మీకు కలిగితే భర్త తరుపునుండి ఒక మధ్యవర్తిని, భార్య బంధువుల నుండి ఒక మధ్యవర్తిని నియమించండి. వారిద్దరూ సంస్కరణను కోరితే అల్లాహ్ వారి మధ్య సమాధానం కుదరటానికి మార్గం చూపుతాడు. అల్లాహ్ సర్వ జ్ఞాని సకలమూ ఎరిగిన వాడు."

(అన్ నిసా: 35)

అయితే ఇస్లాం మానవుని మనసుపై జులుం ప్రదర్శించదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో, తగిన కారణాలున్న పరిస్థితిలో విడాకులు భార్యా భర్తలకిరువురికి వాంఛనీయం అవుతాయి, ఒకరికొకరు విడిపోవాలని కోరుకుంటే ముందు మొదటి తలాక్ చెప్పవలసి వుంటుంది. కొంత కాలం (ఈ కాలం దైవగ్రంథంలో

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల సొపురాయి
గీటురాయి
వారపత్రిక

సూచించటం జరిగింది) తర్వాత అప్పటికీ ఇద్దరి మధ్య రాజీ కుదరకపోతే రెండవ తలాక్ చెప్పుకోవాల్సి వుంటుంది. ఆ తర్వాత మరలా కొంత కాలానికి మూడవ తలాక్ చెప్పుకోవాల్సి వుంటుంది. అంతేకాని వెంట వెంటనే తలాక్ చెప్పేస్తే విడాకులు అయినట్లు కాదు. పైగా విడాకుల గురించి ఒక హదీస్‌లో ఇలా చెప్పటం జరిగింది.

"అల్లాహ్ దృష్టిలో హలాల్ (ధర్మసమ్మత) విషయాలన్నింటిలోకెల్లా అయిష్టకరమైనది విడాకులు," - దైవ ప్రవక్త ముహమ్మద్ (స)

ఒకవేళ ఇస్లాంలో విడాకులు నిషేధించి వున్నట్లయితే మానవుని ఆత్మపై దైవం జులుం చేసినట్లయ్యేది (దైవం క్షమించుగాక). ఎలాగంటే కలిసి జీవించలేని పరిస్థితులేర్పడినపుడు విడాకులు తీసుకునే స్వేచ్ఛను స్త్రీ, పురుషులిరువురికీ ఇవ్వటం జరిగింది. ఉదాహరణకు ఒక శాడిస్టు భర్తతో, నపుంసకుడైన భర్తతో స్త్రీ తన వైవాహిక జీవితం నెరపగలదా? అలాంటప్పుడు ఆమె విడాకులు తీసుకుని మరొక వ్యక్తితో వివాహం చేసుకుని తన జీవితాన్ని సుఖమయం చేసుకోవటం ద్వారా పరిపూర్ణత పొందటం ధర్మబద్ధం కాదా?  ఇస్లామ్ చట్టాలు హేతువుకు దగ్గరగా వుంటాయి. హేతుబద్ధమైన దృక్పథం కలవారెవరైనా వీటిని అంగీకరించి తీరుతారు.

సమాజాన్ని పట్టి పీడించే మరో సమస్య వితంతువు సమస్య, దీన్ని ఇస్లాం ఏనాడో పరిష్కరించింది. విధివశాత్తు భర్త మరణం నొందితే ఒక యవ్వనవంతురాలైన స్త్రీ తన జీవితాంతం వైధవ్యం స్వీకరించడమంటే ఆమె ఆత్మకు ఘోరమైన అన్యాయం జరిగినట్లే. మహాప్రవక్త ముహమ్మద్(స) వితంతు వివాహం చేసుకుని. తన అనుచర సమాజానికి కూడా వితంతు వివాహాలు చేసుకోమని బోధించారు. ఓ సందర్భంలో ఇలా అన్నారు.

"ఓ ప్రజాలారా! వితంతువుల కొరకు దీనుల కొరకు పాటుపడే వ్యక్తి వారిపై దయచూపే వ్యక్తి దైవ మార్గంలో యుద్ధం చేసిన వ్యక్తితో, రాత్రంతా నిలబడి నమాజ్ చేసిన వ్యక్తితో సమానం".

ఈ విధంగా వితంతు వివాహాన్ని ధర్మ కార్యంగా పరిగణించి సామాజికంగా ఆర్థికంగా, నైతికంగా రక్షించిన ధర్మం ఇస్లాం.

బహు భార్యాత్వానికి సంబంధించి అనేకులు ఇస్లాంను విమర్శిస్తుంటారు. ఇది సరియైన అవగాహన లేకపోవటమే. బహు భార్యాత్వం  ఇస్లాంలో విధి కాదు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో, కొన్ని అనివార్యమైన పరిస్థితులలో బహుభార్యాత్వం అనుమతించబడింది. నాటి అరబ్బు సమాజం హింసకు ప్రతిరూపంగా వుండేది. విభిన్న తెగల మధ్య చిన్న చిన్న విషయాలకే ఘోరమైన యుద్ధాలు జరిగేవి. ఉదా? ఒక జాతి వానికి చెందిన ఒంటె మరొక జాతి వానికి చెందిన పొలంలో మేత మేసినందుకు రెండు తెగలు యుద్ధం చేశాయి. 70,000 మంది చనిపోయారంటే అరబ్బులు ఎంత యుద్ధ కాముకులో అర్థమవుతుంది. ఇలాంటి సమాజంలో జన్మించి మహాప్రవక్త ముహమ్మద్ (స) శాంతిని భోధించి వారిని సంస్కరించారు. ఆ కాలంలో తరచు యుద్ధాలలో పాల్గొని యువకులు అసువులు బాసేవారు. తద్వారా వితంతువుల సంఖ్య పెరిగి సమాజంలో ఆడవాళ్ళ శాతం పెరిగి, మగవారి శాతం క్షీణించి నిష్పత్తి క్రమం దెబ్బతిని మొత్తం సమాజం ఉపద్రవాన్ని ఎదుర్కొం టున్న పరిస్థితులుండేవి. నాడు వితంతువులు, అనాధలు కన్నీటి సాగరంలో మునుగుతున్నప్పుడు బహు భార్యాత్వం ద్వారా సామాజిక విపత్తును తప్పించి సమాజంలో నైతిక విలువలు కాపాడటం జరిగింది. దైవ ప్రవక్త(స) రాక మునుపు అరబ్బులు తమ ఇష్టానుసారంగా లెక్కలేనన్ని పెళ్ళిళ్ళు చేసుకునేవారు. ఇస్లాం వీటిని కట్టడి చేసింది.  అవకాశం ఉన్నంత వరకు ఒక స్త్రీతోనే దాంపత్య జీవనం గడపమని సూచించింది. అది మీకు శ్రేయస్కరం అని కూడా చెప్పింది. వివాహ సంఖ్య ఇస్లాంలో నాలుగుకు కుదించటం జరిగింది. అదీ న్యాయం చేయలేమనే అనే పదానికి ఇస్లాం విస్తృతార్థాన్ని ఇచ్చింది. పురుషునికి అనేక హెచ్చరికలు జారీ చెయ్యడం జరిగింది. దీనిని అవగాహన చేసుకున్నవారు కేవలం లైంగిక వాంఛల కొరకు బహుభార్యాత్వాన్ని ఆశించరు. ఈ చట్టం ఏర్పడిన పరిస్థితుల నేపథ్యాన్ని గమనించిన వారు ఇస్లాంను విమర్శించరు. ఇస్లాం చట్టాలను కొంతమంది ముస్లిం పురుషులు తమ స్వలాభం  కొరకు వినియోగించటం వల్లనే ఇలాంటి విమర్శలు వస్తున్నాయి.


ఇస్లాంపై వినవచ్చే మరో బలమైన విమర్శ పరదా పద్ధతి. ఇస్లాంలో స్త్రీలైనా, పురుషులైనా తమ మర్మస్థానాలను ఇతరులను రెచ్చగొట్టే విధంగా బహిర్గతం చెయ్యరాదని చెప్పింది. నిజానికి స్త్రీలు బజారుకు వెళ్ళవచ్చు, ఉద్యోగం చేయవచ్చు. తమకిష్టమైన అనేక సామాజిక ప్రక్రియలలో పాల్గొనవచ్చు. ఇస్లాం వీటిని అడ్డుకోదు. స్వయాన దైవప్రవక్త(స) సతీమణి ఖదీజా(ర) వ్యాపారం చేసేవారు. ఆయన (స) మేనత్త సఫియా(ర) యుద్ధంలో పాల్గొన్నారు. కూతురు ఫాతిమా(ర) యుద్ధరంగంలో సేవలందించారు. రాబియా బస్రీ గొప్ప దైవ సేవకురాలిగా, కవయిత్రిగా ఆధ్యాత్మి

కురాలిగా పేరొందారు. అస్మా సాలెహ(ర) గొప్ప మహిళా నాయకురాలిగా, ధైర్యవంతురాలిగా ఖ్యాతి పొందారు. వీరెవరిపై ప్రవక్త(స) కాలంలోగాని ఆ తరువాత ఖలీఫాల కాలంలో కాని విద్య, వైజ్ఞానిక రంగాలలో ఖ్యాతి నొందిన అనేక మంది మహిళలపై ఎలాంటి ఆంక్షలు లేవు. పైగా వీరంతా ఇస్లాం కోసం త్యాగాలు చేసిన గొప్ప మహిళలుగా కీర్తించబడుతున్నారు. ఇస్లామ్ చరిత్రలో ఇస్లామ్ కోసం అమరగతి నొందిన మొదటి మహిళ సుమయ్య(ర). ఈ రోజు మనం రోజూ టీ వీ.ల్లో, పత్రికల్లో చూస్తూనే వున్నాము. ప్రతిరోజు ఎన్నో మానభంగాలు, హత్యలు, దొమ్మీలు, కొట్లాటలు, ఈవ్ టీజింగ్ వంటి పైశాచిక చర్యలు. ఇవన్నీ స్త్రీల పాలిట శాపంగా మారాయి. స్త్రీలు స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితులు కల్పించాయి. వీటన్నింటికీ మూలకారకమైన "ఉద్రేకం"ను ఇస్లాంలో నియంత్రించటం జరిగింది. స్వేచ్ఛావాదం ముసుగులో పురుషుడు స్త్రీని అంగడి వస్తువుగా చేసి వ్యాపార వస్తువుగా, కేవలం కామం తీర్చుకోవడానికి ఉపయోగపడే సాధనంగా మలిచి వాడుకుంటున్నాడు. పురుషాధిక్య ప్రపంచ కుట్రల్ని అర్థం చేసుకొని స్త్రీలు బలౌతున్నారు. ఇస్లాం స్త్రీలకైనా, పురుషులకైనా హాని కలిగించే విషయాల నుండి వారిని నియంత్రిస్తూ వారికి క్షేమకరమైన విషయాల వైపునకు నడిపిస్తుంది. ఈ సంగతి గ్రహించటం వల్లనే అనేక మంది పాశ్చాత్య మహిళలు ఇస్లాం వైపు నడుస్తున్నారు. బ్రిటీష్ యువరాజు ప్రిన్స్ ఛార్లెస్ మాటల్లో చెప్పాలంటే,

"పాశ్చాత్య వనితలు ఇస్లామ్‌లో మహిళలకు గల మహోన్నత స్వేచ్ఛను, మహత్తర హక్కులను గుర్తించటం జరిగింది. ఇస్లామీయ సంస్కృతిని, జీవన విలువలను, ఇస్లామీయ విజ్ఞానాన్ని చిన్న చూపు చూడటం మనం మానుకోవాలి. ఇస్లామీయ సమాజం నుండి ఇతర సమాజాలు ముఖ్యంగా మన పాశ్చాత్య సమాజం స్వీకరించవల్సింది, నేర్చుకోవల్సింది చాలా వుంది."

ముఖ్యంగా ముస్లిం పురుష ప్రపంచం గ్రహించవలసిన విషయమేమంటే ఇస్లాం దృక్పథంలో స్త్రీకున్న ఔన్నత్యాన్ని, హక్కులను, స్వేచ్ఛను కాపాడుతూ మంచి తండ్రులుగా మంచి భర్తలుగా, మంచి కుమారులుగా, మంచి సోదరులుగా మారితేనే ఇస్లాంపై నెలకొన్న అనేక అపోహల్ని మనం తొలగించ గలుగుతాం. అప్పుడే నిజమైన ముస్లింలుగా మారగలుగుతాం.

## ఖారీ అబ్దుర్రహీమ్ ఇకలేరు!



మృదుస్వభావి, మితభాషి అయిన ఖారీ అబ్దుర్రహీమ్ గారు (వి.డి.ఓ రిటైర్డ్) తేది. 26 మార్చి 2025 బుధవారం నాడు కరీంనగర్‌లో తుదిశ్వాస విడిచి పరమోన్నత ప్రభువు సన్నిధికి చేరుకున్నారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. ఆయన వయస్సు 84 సంవత్సరాలు.

జనాబ్ ఖారీ అబ్దుర్రహీమ్ గారు గీటురాయి వారపత్రికకు గత 25 సంవత్సరాలుగా నిరంతరాయంగా సేవలందించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా గ్రంథాలయ సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న శాఖా గ్రంథాలయాలకు గీటురాయిని జారీ చేయించటంలో తన వంతు కృషి చేశారు.

ఆయనకు ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయనే కాక ఆయన కుటుంబ సభ్యులందరూ జమాఅత్‌లో సభ్యులుగా ఉంటూ విశిష్ట సేవలు అందిస్తూ ఉన్నారు. అల్లాహ్ ఆయన సేవల్ని స్వీకరించి స్వర్గంలో ఆయనకు ఉన్నత స్థానాన్ని ప్రసాదించాలని గీటురాయి సిబ్బంది, యాజమాన్యం వేడుకుంటోంది.




## హిమాలయాలు అద్భుతం : సునీతా విలియమ్స్

అంతరిక్షం నుంచి భారత్ అద్భుతంగా కనిపిస్తున్నట్లు ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్ తెలిపారు. మరో ఇద్దరు వ్యోమగాములతో కలిసి మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్తర భారతంలోని హిమాలయాలు, గుజరాత్ తీరంలోని ఫిషింగ్ బోట్లు కూడా అద్భుతంగా కనిపించినట్లు ఆమె చెప్పారు. భారతీయ సంతతికి చెందిన ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్.. 286 రోజుల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న విషయం తెలిసిందే. ఇటీవలే భూమి మీదకు వచ్చిన ఆమె వ్యోమగామి విల్మోర్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించారు. అంతరిక్షం నుంచి ఇండియా ఎలా కనిపించిందో చెప్పిందామె. ఉత్తర భారతంలోని హిమాలయాలు అద్భుతంగా ఉన్నట్లు సునీతా పేర్కొన్నది. హిమాలయాలు అమేజింగ్‌గా ఉన్నట్లు చెప్పిన ఆమె.. ఆ ప్రాంతం నుంచి ప్రయాణించిన ప్రతిసారీ తన తోటి ఆస్ట్రోనాట్ విల్మోర్ ఫొటోలు తీసేవారని తెలిపింది. హిమాలయాలకు చెందిన అద్భుతమైన ఫొటోలను విల్మోర్ తీశారని, ఆ శిఖరాలు అద్భుతంగా ఉన్నట్లు సునీతా చెప్పింది.

## మైనారిటీలపై హింసలో యూపీ అగ్రస్థానం

మైనారిటీలపై హింసకు సంబంధించి 2014-15 నుండి 2024-25 వరకు జాతీయ మైనారిటీల కమిషన్ (ఎన్‌సీఎం)కు 568 ఫిర్యాదులు అందాయి. వీటిలో అత్యధికంగా 251 ఫిర్యాదులు బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్ నుండే అందాయి. డీఎంకే ఎంపీ పీ.విల్సన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ ప్రశ్నకు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు రాజ్యసభలో ఈ మేరకు సమాధానమిచ్చారు. మైనారిటీలపై జరిగే హింసకు సంబంధించిన నిర్దిష్టమైన వివరాలు కేంద్ర ప్రభుత్వం వద్ద ఉండవని, ఆ ఫిర్యాదులను ఎన్‌సీఎం పరిశీలిస్తుందని ఆయన తెలిపారు. తమకు అందిన ఫిర్యాదులపై తదుపరి చర్యల కోసం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు నివేదిస్తామని ఆయన వెల్లడించారు. విల్సన్ అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా జవాబిస్తూ గడచిన 11 ఏండ్లలో ఎన్‌సీఎంకు 568 ఫిర్యాదులు అందాయని చెప్పారు. వాటిలో యూపీ తర్వాత స్థానంలో 80 ఫిర్యాదులతో ఢిల్లీ ఉందన్నారు. మధ్యప్రదేశ్, హర్యానా నుంచి 33 ఫిర్యాదులు, కేరళ నుంచి 20 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

## ఇస్లామోఫోబియా

కామన్ కాజ్, లోక్ నీతి, సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సి.యస్.డి.యస్) - ఇవి మూడు స్వచ్ఛంద సంస్థలు. సి.యస్.డి.యస్. చాలా పాతది. ఈ మూడు సంస్థలు కలిసి ఇటీవల ఒక నివేదిక ప్రచురించాయి. ఆ నివేదిక పేరు "ది స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా 2025". ఈ సంస్థలు 17 రాష్ట్రాల్లో, 8276 మంది పోలీసు అధికారులను సర్వే చేశాయి. న్యాయమూర్తులు, న్యాయవాదులు, డాక్టర్లతో సుదీర్ఘంగా మాట్లాడాయి. ఆ తర్వాత విడుదల చేసిన నివేదిక ఇది. ఈ నివేదిక దిగ్భ్రాంతికరమైన వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. తీవ్రమైన నేరాల్లో అనుమానితుల పట్ల పోలీసులు హింసాత్మక బలప్రయోగాన్ని ఇందులో 22 శాతం పోలీసులు ఆమోదించారు. క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ చాలా బలహీనంగా, చాలా నెమ్మదిగా పనిచేస్తుందని 28 శాతం అభిప్రాయపడ్డారు. అందువల్ల చట్టాన్ని అతిక్రమించి పనిచేయడం, నిర్దిష్ట ప్రక్రియ పట్ల నిబద్ధత లేకపోవడం కనిపిస్తోంది. అంతేకాదు, కస్టడీ మరణాలకు సంబంధించి అధికారిక సమాచారంలోను లోపాలను ఈ సర్వే బయటపెట్టింది. నేర గణాంకాల సంస్థ ప్రకారం 78 కస్టడీ మరణాలు జరిగాయి. జాతీయ మానవ హక్కుల కమీషన్ ప్రకారం 90. నేషనల్ కాంపేయిన్ ఎగేనిస్ట్ టార్చర్ ప్రకారం 111. ఈ నివేదికలో ముఖ్యంగా గమనించవలసిన విషయం పెరుగుతున్న ఇస్లామోఫోబియా. ముఖ్యంగా పోలీసుల్లో ఇస్లామోఫోబియా పెరుగుతుందని నివేదిక తెలియజేసింది. ముస్లిములంటే నేరస్తుల మాదిరిగా చాలా మంది పోలీసులు భావిస్తున్నారంట. ఢిల్లీ, రాజస్థాన్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, గుజరాత్, జార్ఖండ్ పోలీసుల్లో ఈ ధోరణి కనిపించింది. అయితే శిక్కు పోలీసుల్లో ఇలాంటి అభిప్రాయాలు లేవన్నది కూడా నివేదిక తెలియజేసింది. గుజరాత్, ఒడిశా, రాజస్థాన్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో గోవధ కఠిన చట్టాలను, ఇలాంటి కేసుల్లో మూకదాడులకు పోలీసుల మద్దతును కూడా ఈ నివేదిక ప్రస్తావించింది. ముస్లిముల పట్ల వివక్షను ఈ నివేదిక నొక్కి చెప్పింది.




## మయన్మార్‌కు ఆపన్నహస్తం..
## 15 టన్నుల సహాయ సామగ్రిని పంపిన భారత్

మయన్మార్ (Myanmar), థాయ్‌లాండ్ (Thailand) దేశాలను రెండు అత్యంత శక్తిమంతమైన భూకంపాలు (Earthquakes) కుదిపేసిన విషయం తెలిసిందే. నిమిషాల వ్యవధిలోనే చోటు చేసుకున్న భూ ప్రకంపనలతో రెండు దేశాలు వణికి పోయాయి. రోడ్లు, వంతెనలు, ఎయిర్‌పోర్ట్‌లు దెబ్బతిన్నాయి. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ విపత్తులో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఈ నేపథ్యంలో ప్రకృతి ప్రకోపానికి తీవ్రంగా నష్టపోయిన మయన్మార్, థాయ్‌లాండ్‌ను ఆదుకునేందుకు భారత్ (India) దాదాపు 15 టన్నుల సహాయ సామగ్రిని సైనిక రవాణా విమానంలో పంపింది. 'ఆపరేషన్ బ్రహ్మ' (Operation Brahma) కింద భారత వైమానిక దళానికి చెందిన C130J విమానం సహాయ సామగ్రితో హిండన్ వైమానిక దళ కేంద్రం నుంచి మయన్మార్‌కు బయల్దేరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందులో టెంట్లు, దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, జనరేటర్లు, ఆహార ప్యాకెట్లు, నీటి శుద్ధి పరికరాలు, సౌర దీపాలు, అవసరమైన మందులు పంపుతున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌తోపాటు అమెరికా, ఇండోనేషియా, చైనా కూడా అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించాయి.

## డ్రైవర్లకు అత్యంత ప్రమాదకర దేశాల జాబితాలో భారత్ ఏ స్థానంలో ఉందంటే?

వాహనాల డ్రైవర్లకు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర దేశంగా దక్షిణాఫ్రికా వరుసగా రెండవ ఏడాది జాబితాలో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. 53 దేశాలలో పరిశోధన చేసిన అమెరికాకు చెందిన డ్రైవర్ ట్రైనింగ్ కంపెనీ తాజా జాబితాను విడుదల చేసింది. డ్రైవర్లకు అత్యంత ప్రమాద కరమైన, సురక్షితం కాని దేశాల జాబితాలో భారత్ 5వ స్థానాన్ని దక్కించుకుంది. అమెరికా భారత్‌ను మించిపోయి 3వ స్థానాన్ని సాధించినట్లు డ్రైవింగ్ కోర్సులను నిర్వహిస్తున్న అంతర్జాతీయ డ్రైవర్ల శిక్షణ కంపెనీ జుటోబీ.కాం వెల్లడించింది. ప్రపంచంలో డ్రైవర్లకు అత్యంత సురక్షిత దేశంగా వరుసగా నాలుగో ఏడాది నార్వే నిలిచింది. సురక్షితం కాని దేశాలలో దక్షిణాఫ్రికా అగ్ర స్థానంలో ఉంది. వాహనాల వేగం, డ్రైవర్లకు బ్లడ్ ఆల్కహాల్ కాన్సెంట్రేషన్ లిమిట్స్, రోడ్డు ట్రాఫిక్ మరణాల సంఖ్య తదితర సూచికల ఆధారంగా జుటోబీ.కాం ర్యాంకింగ్‌లు ఇస్తోంది.

## 500 మంది భారతీయ ఖైదీలకు క్షమాభిక్ష

రమజాన్ పండుగ వేళ యూఏఈ ప్రభుత్వం భారత్‌కు గుడ్ న్యూస్ చెప్పింది. పండుగకు ముందు 500 మందికి పైగా భారతీయ ఖైదీలను విడుదల చేసింది, మరో 1,518 మంది ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసింది. ఆ దేశ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ 1,295 మంది ఖైదీలను విడుదల చేయాలని ఆదేశించారు. దీంతో యూఏఈ ప్రధాన మంత్రి షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేశారు. రంజాన్ పర్వదిన సమయాన తన దయార్ద్ర హృదయాన్ని చూపించిన యూఏఈ.. భారత్‌తో పాటు ఇతర దేశాలకు చెందిన ఖైదీలకు పెద్ద ఎత్తున ఖైదీలకు క్షమాభిక్ష పెట్టింది. అధికారిక ఉత్తర్వుల ప్రకారం, క్షమాభిక్ష మంజూరు చేయబడిన వారిలో, 500 మందికి పైగా భారతీయ ఖైదీలు ఉన్నారు. ఫిబ్రవరి చివరి వారంలో ఈ ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయి.



## జూన్ వరకు భగభగలే

దేశంలో ఈసారి ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశంలోని పశ్చిమ, తూర్పు ప్రాంతాలు మినహా చాలా చోట్ల సాధారణ స్థాయి కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాల్లో ఎక్కువ రోజులపాటు వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ సారి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు రాష్ట్రాల్లో సాధారణ స్థాయికి మించి 2 నుంచి 4 రోజులపాటు తీవ్రమైన వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నదని స్పష్టం చేసింది.

# చాడీలు

- జునైద్ అహ్మద్ ఖాన్

ఒకరిపై ఒకరికి చాడీలు చెప్పడం, ఇతరులపై నిందలు వేయడం కొంత మందికి అలవాటు. చాడీలు, నిందల వల్ల భయానకమైన దుష్పరిణామాలు సంభవించే అవకాశాలు ఉంటాయి. కాని కొంతమంది ఇవేమీ పట్టించుకోకుండా ఒకరిపై ఒకరికి చాడీలు చెప్పి, నిందలు వేసి పైశాచికానందం పొందుతారు.

ఒక వ్యక్తిని గురించి, అతడి చర్యల గురించి ఇతరుల ముందు ప్రస్తావించడం, 'నింద'లు మోపడం వల్ల గౌరవ మర్యాద లకు భంగం కలుగుతుంది. ఆత్మగౌరవం దెబ్బతింటుంది. నిందల వల్ల మనసుల్లో విద్వేషపు బీజాలు రాజుకుంటాయి. దీని ఫలితంగా కొన్ని సందర్భాల్లో భయానక ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. అందుకే 'నింద'ను మహా పాపంగా పేర్కొంటూ, 'మృత సోదరుని మాంసం భక్షించడం'తో సమానంగా అభివర్ణించాయి ఖుర్ఆన్, హదీసులు.

అలాగే పరోక్షనింద. ఇది అంతకన్నా మహా పాపం. ఇలా పరులపై పరోక్ష నిందలు మోపేవారిని దేవుడూ క్షమించడు. ప్రజలూ క్షమించరు. దేవుని దృష్టిలో, ప్రజల దృష్టిలో వారు పరమ దుర్మార్గులు.

ప్రవక్త మహనీయులు ఇలా ప్రవచించారు:

'హృదయాల్లో ఈమాన్ సారం దిగకుండా, నోటి మాటగా విశ్వసించిన జనులారా! విశ్వాసులపై నిందలు వేయకండి. కనబడని వారి దోషాల వెంట పడకండి. ఎవరైతే ఇలా చేస్తారో, అల్లాహ్ కూడా వారి పట్ల అలానే వ్యవహరిస్తాడు. ఎవరిపట్లనైతే దైవం ఇలా వ్యవహరించాడో, (ఇక చూడండి) వారిని వారి గృహాల్లోనే పరాభవం పాలు చేస్తాడు.'

అంటే ఇతరులపై నిందలు మోపడం, వారి తప్పులు, బలహీనతల వెంటపడి కూపీలు లాగడం కపటులు చేసే పని. కపట విశ్వాసులు మాత్రమే ఇలాంటి దుస్సాహసాలకు తెగబడతారు. అందుకే వారు కేవలం 'నోటితో మాత్రమే విశ్వాస వచనం పలికారని, నామమాత్రపు విశ్వాసులని, విశ్వాససారం వారి హృదయాల్లో దిగనే లేదని, వారిలో మానవత్వం ఏ కోశానా లేదని ప్రవక్త మహనీయులు చెప్పారు.

ఇంకా ఆయన(స) ఇలా అన్నారు: 'నేను మేరాజ్ యాత్రకు వెళ్ళినప్పుడు, అక్కడ కొంతమంది నాకు తారసపడ్డారు. వారి గోళ్ళు ముదురు ఎరుపు రంగులోని రాగి గోళ్ళలా ఉన్నాయి. వాటితో వారు తమ ముఖాలను, ఎదురొమ్ములను గీరుకొని రక్తసిక్తం చేసుకొంటున్నారు. అప్పుడు నేను, 'వీళ్ళెవరు? ఇంతటి భయంకరమైన శిక్ష అనుభవిస్తున్నారు?' అని జిబ్రయీల్ (అ)ను అడిగాను.

'వీళ్ళు తమ ఇహలోక జీవితంలో ప్రజల మాంసాన్ని భక్షించేవారు. అంటే, పరులపై నిందలు వేసేవారు, అపనిందలు మోపే వారు, వారి గౌరవ మర్యాదలతో చెలగాట మాడేవారు' అని చెప్పారు జిబ్రయీల్.

కొంతమందికి ఇతరులను నిందించడం, రకరకాల కామెంట్లు చేయడం, వారి పరోక్షంలో ఉన్నవి, లేనివి ఊహించుకొని, కల్పించుకొని చెప్పుకోవడం ఒక కాలక్షేపం. అదొక పైశాచిక ఆనందం. ఇతరుల విషయంలో నోరెత్తే హక్కు తమకు లేదన్న ఇంగితం కూడా వారికి ఉండదు. దానివల్ల వారికి ఎంత అపార నష్టం జరుగుతుందో వారు ఆలోచించలేక పోతారు. దైవం మనకు నోరెందుకిచ్చాడు? ఇతరుల్ని తిట్టడానికా, నిందించ డానికా? బుద్ధిజ్ఞానాలను ఎందుకు ప్రసాదించాడు? ఇతరు లను గురించి చెడుగా, దుర్మార్గంగా ఆలోచించడానికా? మనసులో రేకెత్తే ఆలోచనల విషయం కూడా రేపు దైవం ప్రశ్నిస్తాడు. నోటి నుండి వెలువడే ఒక్కొక్క మాటకు, చేసే ఒక్కొక్క పనికి దైవానికి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. నోటికొచ్చినంత మాట్లాడతామంటే కుదరదు. పరుల మనసు గాయపరిచే వారిని దైవం ఎంత మాత్రం క్షమించడు. చేతనైతే నాలుగు మంచి మాటలు మాట్లాడాలి. మంచి ఆలోచనలు కలిగి ఉండాలి. చేయగలిగితే మేలు చేయాలి. లేకపోతే మౌనంగా ఉండాలి. మనసులో ఏమాత్రం కుళ్ళు, కుట్ర, కాపట్యం, దుర్మార్గపు ఆలోచనలు ఉన్నా దేవుని ఆగ్రహానికి గురికాక తప్పదు. ఇటువంటి వైఖరిని ప్రజలూ సహించరు. సమాజమూ హర్షించదు. కనుక కొన్నాళ్ళ ఈ ప్రాపంచిక జీవితంలో మనసును కల్మషాలతో నింపుకొని, పైశాచిక ఆనందం అనుభవిస్తే, శాశ్వతంగా దుర్భర శిక్షను అనుభవించవలసి ఉంటుందని గ్రహిం చాలి. దైవం అందరికీ మంచి మనసును ప్రసాదించాలని, మంచి, పరోపకార భావన తప్ప మరో దురాలోచన మనసులో రాకుండా రక్షించాలని కోరుకుందాం.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**



# చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమద్‌కు "కళారత్న" పురస్కారం

**ప్రముఖ చరిత్రకారులు,** బహుగ్రంథ రచయిత ప్రస్తుత పిడుగురాళ్ల నివాసి సయ్యద్ నశీర్ అహమద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ఉగాది సందర్భంగా ప్రకటిస్తున్న "కళారత్న" పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ముఖ్య కార్య నిర్వహణాధికారి శ్రీ మల్లికార్జునరావు నుండి నశీర్ అహమద్ వర్తమానం అందుకున్నారు,

భారత స్వాతంత్ర్యోద్యమంలో భారతీయ ముస్లిం జనసముదాయాలు నిర్వహించిన పాత్రను వివరిస్తూ గత మూడు దశాబ్దాలుగా కృషి చేస్తున్న నశీర్ తెలుగులో 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రచించి వెలువరించారు. ఈ గ్రంథాలు ఆంగ్లం, ఉర్దూ, హిందీ, తమిళం, కన్నడం, గుజరాతి భాషలలో అనువదించబడి వెలువడ్డాయి. చరిత్ర గ్రంథ రచనలతో సరిపెట్టుకోకుండా మన స్వాతంత్ర్య సమర యోధుల త్యాగమయ, సాహసోపేత పాత్రను ప్రజలకు, ముఖ్యంగా యువత, విద్యార్థులకు తెలియపరుస్తూ పలు ప్రచార కార్యక్రమాలను ఆయన దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా అవిశ్రాంతంగా నిర్వహిస్తున్నారు. చరిత్ర గ్రంథాల రచన, ప్రచురణను వ్యాపార దృష్టితో కాకుండా సామాజిక సేవా దృష్టితో నిర్వహిస్తున్న నశీర్ అహమ్మద్ తన కుటుంబం, మిత్రుల ఆర్థిక సహకారంతో ప్రచురించిన గ్రంథాలను ఎంపిక చేసిన వందలాది గ్రంథాలయాలకు, చరిత్రకారులకు, జర్నలిస్టులకు తమ వదాన్యుల చిరు కానుకగా అందిస్తున్నారు. ఈ గ్రంథాల పీడీఎఫ్ ఫైళ్ళను ప్రత్యేకంగా తయారు చేయించి కోరిన వారికి అంతర్జాలం ద్వారా లక్షలాది పాఠకులకు అందజేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పాఠకుల సౌకర్యార్థం తన గ్రంథాలన్నిటినీ అంతర్జాలం మాధ్యమాల ద్వారా అందుబాటులో ఉంచారు. ఈ విధంగా సుమారు మూడు దశాబ్దాలుగా సయ్యద్ నశీర్ అహమద్ అవిశ్రాంతంగా సాగిస్తున్న కృషికి గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతిష్టాత్మక **"కళారత్న"** పురస్కారం ప్రకటించింది. ఈ పురస్కారం క్రింద 50,000 రూపాయలు నగదు, జ్ఞాపికతో రాష్ట్ర ప్రభుత్వం సయ్యద్ నశీర్ అహమద్‌ను మార్చి 30న రాష్ట్ర రాజధాని అమరావతిలో ఏర్పాటు చేస్తున్న ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సత్కరించనున్నారు.

❖ ❖ ❖